ఉష్ణోగ్రత (అంచనా)

20-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	38	27
తెనాలి	38	28
నరసరావుపేట	38	27
బాపట్ల	39	28
రెంటచింతల	37	27
చీరాల	39	28

స్వర్ణ పంచాయతీలు.. వేగవంతం



- చురుగ్గా సాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియ
- ప్రజలకు అందుబాటులోకి పల్లె వివరాలు
- వివాదాలు లేని గ్రామాలు.. ఆన్‌లైన్‌లోనే పన్నులు

వెబ్‌లోనే వివరాలన్నీ..

స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌లో గ్రామానికి చెందిన అన్ని వివరాలు ఉంటాయి. గ్రామ ముఖ చిత్రం, ఆ పంచాయతీలోని ఇళ్ల విస్తీర్ణం, హద్దులు, యాజమాని పూర్తి వివరాలు ఉంటాయి. అంతేకాకుండా ఏడాదికి ఎంతపన్ను చెల్లిస్తున్నారు, ఆస్తి వ్యాపార సముదాయాలకు సంబంధించి పన్నులు, చెరువులు, స్థలాలు, లీజు, సెల్ టవర్లు, పరిశ్రమల వివరాలు ఉంటాయి. పంచాయతీ వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చాక సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే పొందవచ్చు. అవసరమైన ధృవీకరణ పత్రాలు, అనుమతులు ఆన్‌లైన్ ద్వారా తీసుకోవచ్చు.

గుంటూరు సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎక్కువగా జరిగే గొడవలన్నీ ఇళ్ల సరిహద్దులకు సంబంధించినవే. ఎప్పుడో రిజిస్ట్రేషన్ అయిన దస్తావేజులు ఉన్నా ఆ పంచాయితీ పరిష్కారానికి తరాలు మారాల్సిందే. అటువంటి గొడవలు, సివిల్ వివాదాలకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చక్కని పరిష్కార మార్గాన్ని ఎన్నుకుంది. స్వర్ణ పంచాయతీ పేరుతో చారిత్రక కార్యక్రమానికి ఊపిరి పోసింది. వాస్తవానికి ఈ కార్యక్రమం గత వైసీపీ ప్రభుత్వంలోనే ఆరంభమైనా ముందుకు పోవడానికి ఆపసోపాలు పడింది. కూటమి ప్రభుత్వం అదే కార్యక్రమాన్ని జెట్ స్పీడ్‌తో పరుగులు పెట్టిస్తోంది. స్వర్ణ పంచాయతీ నిబంధనలకు అనుగుణంగా అన్ని వివరాలు ఆన్‌లైన్ లో నమోదు అయితే గ్రామ పంచాయతీ వ్యవస్థలో ఒక సువర్ణ అధ్యాయం ఆరంభం అవుతుంది. స్వర్ణ పంచాయతీ ప్రక్రియ చురుగ్గా సాగుతుంది. గుంటూరు జిల్లాలో 2,49,067 పాత రసీదులు అసెస్మెంట్లు ఉండగా 1,67,818 అసెస్మెంట్లు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేశారు. పల్నాడు జిల్లాలో 389433 అసెస్మెం ట్లు ఉండగా 346902 మంది యజమానులు ఉన్నారు. వారిలో 319138 మంది ఆధార్‌లు అనుసంధానం చేశారు. బాపట్ల జిల్లాలో కూడా ఈ ప్రక్రియ చురుగ్గా సాగుతుంది.

సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే...

స్వర్ణ పంచాయతీ పేరుతో అన్ని సేవలను ఆన్‌లైన్‌లో పొందు పరుస్తున్నారు. ముఖ్యంగా ఇంటి కొలతలు, పన్ను చెల్లింపులు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం ఎవరైతే సదరు ఇంట్లో నివాసం ఉంటున్నారో గమనించి, వారి దస్తావేజులు పరిశీలించి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ ఇల్లు ఎంత విస్తీర్ణంలో ఉంది.. కొలతలను పక్కాగా రూపొందించి మ్యాప్ సహా కంప్యూటరైజేషన్ చేస్తారు. దానివల్ల గతంలో మాదిరిగా ఒకరి ఆస్తిని మరొకరు ఆక్రమించడం, దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకోవడం కుదరదు. ఇంటి పన్ను కూడా ఇష్టానుసారంగా మార్చే అవకాశం ఉండదు.

పన్నులు గల్లంతు..

గతంలో పంచాయతీ కార్యదర్శి రసీదులు ఇచ్చి పన్నులు వసూలు చేసే వారు. వాటిలో కొంత భాగం పక్కదారి పట్టించేవారు. గృహ యజమానుల నిరక్షరాస్యతను అడ్డం పెట్టుకుని ఒకే పన్ను రెండు మూడు సార్లు వసూలు చేసే వారు. స్వర్ణ పంచాయతీ విధానంలో గృహ యజమాని ఇంటి పన్ను ఆన్‌లైన్‌లో కూడా చెల్లించవచ్చు. ఇంటి పన్ను ఒక వేళ సచివాలయంలో చెల్లించినా దానికి సంబంధించిన రసీదును కంప్యూటర్ నుంచి పొందవచ్చు. ఇంటి పన్ను చెల్లింపు వివరాలు వెంటనే ఆన్‌లైన్‌లో నమోదవుతాయి కాబట్టి మళ్లీ మళ్లీ చెల్లించాల్సిన అవసరం ఉండదు.



రాజధాని నిర్మాణ సంస్థలలో కార్మికుల వసతులను పరిశీలిస్తున్న ప్రపంచ బ్యాంకు, ఏడీబీ బృందం సభ్యులు

కార్మికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలి

- సీఆర్డీఏకు ప్రపంచ బ్యాంకు బృందం సూచన

తుళ్లూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనుల్లో కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఆర్డీఏ అధికారులకు ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందం సూచించింది. ఈ బృందం గురువారం అమరావతిలో పర్యటించి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాస సముదాయాలు, శాఖమూరు రిజర్వాయర్, ఎల్పీఎస్ జోన్ 2ఏ ప్రాజెక్టు సైట్, కార్మికుల క్యాంపులను పరిశీలించింది. కార్మికులతో బృందం సభ్యులు మాట్లాడారు. మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. తొలుత బృందం రాజధాని అమరావతి నిర్మాణంలో అమలు చేయాల్సిన పర్యావరణ, సామాజిక రక్షణ, కార్మికుల భద్రత తదితర అంశాలపై విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయంలో అదనపు కమిషనర్ జీ.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ నుంచి వివరాలు తీసుకుంది. అమరావతిలో నివసిస్తున్న ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, నైపుణ్య శిక్షణ ఉపాధి అవకాశాల గురించి తెలిపారు. లింగ వివక్ష, బాల కార్మికులకు తావు లేకుండా పనులు చేపట్టినట్లు వివరించారు. అమరావతి నిర్మాణం ప్రాజెక్టులో భాగంగా పర్యావరణ, సామాజిక వ్యవస్థల అసెస్‌మెంట్ పక్రియపై బృందంలోని సీనియర్ సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు బాయన వెంకట్రావు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో బృందంలోని సీనియర్ ఎన్విరాన్‌మెంట్ స్పెషలిస్టు జోసెఫ్, పర్యావరణ సంరక్షణ కార్యకలాపాల సలహాదారుల దమన్‌జీత్‌సింగ్ మిన్హాస్, మహిళా ప్రతినిధి జయశర్మ, సీఆర్డీఏ, ఏడీసీఎల్ చీఫ్ ఇంజనీర్లు సీహెచ్ ధనుంజయ, ఎస్.శ్రీనివాసులు, ఎం.ప్రభాకరరావు, ఎస్ఈ హనుమంత రెడ్డి, డీఈ పి.వెంకటేశ్వర్లు, ఈఈ కె.శ్రీనివాసరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

దూరమైన... కంటి వైద్యం

- సీఎంఈఐ కేంద్రాల తొలగింపు
- కంటి పరీక్షకు పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి



వేమూరులో సీఎంఈఐ కేంద్రం (ఫైల్ ఫొటో)

వేమూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పల్లె ప్రజలకు కంటి వైద్యాన్ని అందుబాటులోకి తేవాలని గత టీడీపీ ప్రభుత్వం సంకల్పించగా వైసీపీ ప్రభుత్వం మార్పులు చేసి దానికి తూట్లుపొడిచింది. 2014లో టీడీపీ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గ కేంద్రాల్లో సీఎంఈఐ కేంద్రాలను ఏర్పాటు చేసింది. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలకు కంటి వైద్యాన్ని చేరువ చేసింది. ఈ కేంద్రాల్లో ప్రతి వ్యక్తి ఆధార్ నెంబర్‌ను అనుసంధానం చేసుకుని కంటి పరీక్షలు చేయడంతో పాటు మందులు, కళ్లజోళ్లు ఉచితంగా అందించే వారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు కూడా ఉచితంగా చేశారు. గ్రామీణులు ఎందరో అప్పట్లో కంటి వైద్యం అందుకున్నారు. ఉదాహరణకు ఒక్క వేమూరులోని కేంద్రంలోనే రోజుకు 70 నుంచి 100 మందికి పైగా నెలలో 2000 మందికి పైగా వైద్య సేవలు అందుకునేవారు. ఇదే పరిస్థితి గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని కేంద్రాల్లో కూడా ఉండేది. తద్వారా గ్రామీణ ప్రజల కళ్లకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఎందరో పేదలు, వృద్ధులు, ఆపరేషన్లు ద్వారా వెలుగును చూడగలిగారు. అలాంటి విధానాన్ని 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం కంటి వెలుగుగా మార్పు చేసింది. ఆయా కేంద్రాల్లో పని చేసి టెక్నికల్ అసిస్టెంట్లను గ్రామాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసి సేవలందించాలని ఆదేశించింది. ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టి మెరుగైన విధానానికి తూట్లు పొడిచింది. చంద్రబాబు ఆలోచనలకు విరుద్ధంగా సేవలను మార్చడంతో ప్రజలు ఫలితాలను అంతగా అందుకోలేకపోయారు. కూటమి పాలన రావడంతో తిరిగి సీఎంఈఐ కేంద్రాలు పునరుద్ధరిస్తారని ప్రజలు ఎదురు చూస్తున్న తరుణంలో అపోలో కాంట్రాక్టు రద్దైంది. దీంతో ఈ కేంద్రాలను ప్రభుత్వం మూసేసింది. దీంతో గ్రామీణ ప్రజలకు కంటి వైద్యం దూరమైంది. పట్టణ ప్రాంతాలకు వెళ్లి ఖరీదైన కంటి వైద్యం చేసుకునేందుకు పేదలు ఆర్థికంగా, శారీరకంగా ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం తిరిగి సీఎంఈఐ కేంద్రాలను పునః ప్రారంభించేందుకు ఆలోచన చేసి కంటి వైద్య సేవలను చేరువ చేయాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బర్లీ సంబరం

- రైతుల ఆనందోత్సాహాల మధ్య కొనుగోళ్లు
- పర్చూరులో అట్టహాసంగా మార్క్‌ఫెడ్ కేంద్రం ప్రారంభం
- చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తామన్న మంత్రి అచ్చెన్నాయుడు
- అసాధ్యాన్ని సుసాధ్యం చేశామన్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



కొనుగోలు కేంద్రంలో పొగాకు బేళ్లను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బర్లీ పొగాకు దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా ధర లేక కొందరు.. కొనుగోళ్లు చేయలేక మరికొందరు అల్లాడిపోయారు. కంపెనీల ద్వారా కొనుగోళ్లకు ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసినా రైతుల్లో ఆందోళన తగ్గలేదు. దీంతో ఎట్టకేలకు నేరుగా ప్రభుత్వమే రంగంలోకి దిగి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లకు సిద్ధమైంది. సీఎం చంద్రబాబు ప్రకటించినట్లుగా బాపట్ల, పల్నాడు, గుంటూరు రైతులకు ఊరట ఇస్తూ గురువారం నుంచి బర్లీ పొగాకు కొనుగోళ్లకు అధికారులు శ్రీకారం చుట్టారు. చరిత్రలో ఎప్పుడూలేని విధంగా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్ల కార్యక్రమానికి పర్చూరు వ్యవసాయ మార్కెట్‌యార్డు వేదికగా నిలిచింది. కొనుగోళ్లను ప్రారంభించడానికి వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పర్చూరుకు రాగా రైతులు ఘనస్వాగతం పలికారు. దాదాపు 500 ట్రాక్టర్లతో పర్చూరులో రైతులు ర్యాలీ నిర్వహించారు. పండుగ వాతావరణం తలపించేలా కొనుగోళ్ల కార్యక్రమం జరిగింది. మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ పొగాకు కొనడం అసాధ్యమని విమర్శించిన వారందరికీ ప్రారంభమైన కొనుగోళ్లే సమాధానమని మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. రైతులెవరూ అధైర్యపడవద్దని చివరి ఆకు వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి తెలిపారు. పొగాకు కంపెనీల ఉచ్చులో పడి పొగాకు సాగు (మిగతా 4లో)

మూడొంతెనల ముంపు.. మళ్లింపు

- డ్రెయినేజి సమస్యకు పరిష్కారంగా వెంట్ నిర్మాణం
- సీఆర్ఎస్ అనుమతి కోసం నిరీక్షిస్తున్న రైల్వే శాఖ



మూడొంతెనలు కిందకు ఇటీవల చేరిన వరదనీరు(ఫైల్)

గుంటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక డొంకరోడ్డు మూడొంతెనలను ఇటీవలే ఆధునికీకరించినా వర్షం వస్తే వరదనీటి ముంపు సమస్య తప్పడం లేదు. రూ.13 కోట్లు ఖర్చు చేసిన ఫలితం లేకపోవడంతో డ్రైనేజీ మళ్లింపు చేపట్టాలని రెండు శాఖలు నిర్ణయించాయి. గత నెలలో కురిసిన చిన్నపాటి వర్షాలకే సబ్‌వేలో అరగంటకు పైగానే వరద నీరు నిలిచి వాహనదారులు, పాదచారులను ఇబ్బంది పెట్టడంపై విమర్శలు వ్యక్తమౌతున్న నేపథ్యంలో సమస్యాత్మకంగా మారిన డ్రెయినేజీని ఒక పెద్ద వెంట్ నుంచి అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో కలిపేందుకు నగరపా లకసంస్థ, రైల్వే శాఖ సంయుక్తంగా నిర్ణయించాయి. ఇందుకోసం రైలుపట్టాల కిందగా నీరు ప్రవహించడానికి ఒక వెంట్‌ని నిర్మించేందుకు కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీకి నివేదించాయి. సీఆర్ఎస్ నుంచి అనుమతి రాగానే ఆ పనులు మొదలు పెడతామని రైల్వే ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. తొలుత రైలుపట్టాల వరకు డ్రెయినేజి మళ్లింపు పనులు చేపట్టి సీఆర్ఎస్ అనుమతి వచ్చిన తర్వాత బ్లాక్ తీసుకుని పట్టాల కిందగా వెంట్‌ని ఏర్పాటు చేయాలని నిర్ణయానికి వచ్చాయి.

శంకర్‌విలాస్ ఆర్వోబీ నిర్మాణ పనులు ప్రారంభిస్తే చాలావరకు ట్రాఫిక్ డొంకరోడ్డు మూడొంతెనల కిందగా డైవర్షన్ జరుగుతుంది. ఆ సందర్భంలో వర్షం కురిసి వరదనీరు సబ్ వే కిందకు చేరితే ట్రాఫిక్ గంటల తరబడి స్తంభించిపోయే ప్రమాదం ఉన్నది. ఈ నేపథ్యంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ డొంకరోడ్డు మూడొంతెనల పొడిగింపు పనులను ఇటీవలే పూర్తి చేయించారు. వర్షం కురిసినా బ్రిడ్జి కింద ఎలాంటి ఇబ్బంది లేకుండా డ్రెయినేజి వ్యవస్థకు రూపకల్పన చేశామని అటు రైల్వే, ఇటు నగరపాలకసంస్థ అధికారులు చెప్పారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు వరదనీరు చేరి నిలబడటంతో అవుట్‌ఫాల్ డ్రెయినేజీ సమస్య వల్లే సబ్ వే కింద నీరు నిలిచిందని రైల్వే శాఖ పేర్కొన్నది.

23న సుపరిపాలన -స్వర్ణాంధ్ర

- వెలగపూడిలోని సచివాలయం సమీపంలో నిర్వహణ
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్

నేటి నుంచి బోయపాలెంలో పొగాకు కొనుగోళు

- మార్క్‌ఫెడ్ డీఎం నరసింహారెడ్డి
- స్పైసెస్ పార్కులో జిల్లా కొనుగోలు కేంద్రం

గుంటూరు - బీబీనగర్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టుకు.. పల్నాడులో 48.10 ఎకరాల భూ సేకరణ

- 13 గ్రామాల్లో వేర్వేరు సర్వే నంబర్లలో రెండో రైలుమార్గం నిర్మాణం
- కాంపిటెంట్ అథారిటీగా సత్తెనపల్లి ఆర్డీవో నియామకం
- ల్యాండ్ ప్లాన్‌లు, గజిట్ నోటిఫికేషన్ జారీ

వివరాలు 4లో

వినూత్నం.. ఆదర్శం.!

6



తాము పండించిన దేశవాళీ వరి విత్తన కంకులు చూపుతున్న అత్తోట రైతులు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ జనార్ధనరావు, సీఐ రమేష్‌బాబు

సినీఫక్కీలో తెనాలిలో వియ్యపురాళ్ల హత్య

- పట్టపగలు దారుణానికి ఒడిగట్టిన ముగ్గురు
- బంగారం దోచుకెళ్లి ఇద్దరూ ఘర్షణ పడినట్లుగా చిత్రీకరణ
- సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల గుర్తింపు
- ఘటనా స్థలాన్ని సందర్శించిన ఎస్పీ సతీషకుమార్

లోపలి పేజీల్లో..

సమస్యల్లో.. సాంకేతిక విద్య

- పదేళ్లుగా తాత్కాలిక భవనాల్లోనే పాలిటెక్నిక్ కళాశాల
- పొన్నూరులో స్థలం కోసం అన్వేషణ..
- పెండింగ్‌లో నిర్మాణం

పొన్నూరుటౌన్, జూన్ 19: పదేళ్లుగా సొంత భవనాలు లేవు.. స్థలం కేటాయింపు జరగలేదు.. ఏటికేడు విద్యార్థుల అడ్మిషన్లు పడిపోతున్నాయి.. అయినా ప్రభుత్వంలో కదలికలేదు. ఇదీ పొన్నూరులో 2014లో ప్రారంభించిన పాలిటెక్నిక్ కళాశాల దుస్థితి. మొత్తమ్మీద పొన్నూరులో సాంకేతిక విద్య సమస్యల వలయంలో విలవిలలాడుతోంది. గ్రామీణ ప్రాంతమైన పొన్నూరులో సాంకేతిక విద్యను అందించాలనే సదాశయంతో 2014లో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయించారు. కళాశాల నిర్మాణానికి ఐదెకరాల భూమి అవసరం కాగా ప్రభుత్వ భూమి అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తుల నుంచి భూమిని తీసుకునేందుకు ప్రభుత్వం మొగ్గు చూపింది. భూమి దానంగా ఇచ్చే వ్యక్తుల పేరిట కళాశాలను ఏర్పాటు చేస్తామని అప్పట్లో ప్రతిపాదన చేశారు. అయితే ఎవరూ ముందుకు రాకపోవడంతో కళాశాలను చేబ్రోలు తరలించాలని చూశారు. అయితే అక్కడే కూడా స్థల సమస్య నెలకొంది. భూమి సమస్య పరిష్కారం కాకపోవడంతో పొన్నూరులోని శ్రీరామా మున్సిపల్ హైస్కూల్‌లో ఖాళీగా ఉన్న భవనంపై అంతస్థులో కళాశాలను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. అదే ప్రాంగణంలో పదేళ్లుగా కళాశాలను నిర్వహిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మండల పరిధిలోని సీతారామపురానికి చెందిన వైసీపీ నేత రెండెకరాలు భూమిని కళాశాలకు ఇస్తానని ముందుకు వచ్చారు. అయితే ఇంతవరకు స్థలం అప్పగించలేదు. అయితే ఆయన తండ్రి పేరుతో కళాశాల నిర్వహణ కొనసాగుతుంది.



ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల



తెరచుకోని తరగతి గదులు

పదికి పడిపోయిన అడ్మిషన్లు

పొన్నూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సౌకర్యాలు లేమి, అధ్యాపకుల కొరత వేధిస్తోంది. పొన్నూరు కళాశాలలో సివిల్, మెకానికల్ కోర్సులకు మాత్రమే అనుమతి ఉంది. ఆ కోర్సులకు అంతగా డిమాండ్ లేదు. డిమాండ్ ఉన్న కంప్యూటర్, ఈసీఈ వంటి కోర్సులు లేకపోవడంతో కళాశాలలో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. కళాశాలలో గ్రంథాలయం, ప్రయోగశాలలు లేవు. హాస్టల్ వసతి లేకపోవడంతో దూర ప్రాంత విద్యార్థులు ఇక్కడ చేరేందుకు ముందుకు రావడంలేదు. దీంతో ప్రస్తుతం కళాశాలలో కేవలం 10 మంది మాత్రమే విద్యార్థులు ఉన్నారు. పాలకులు, అధికారులు స్పందించి కళాశాల మనుగడకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈనాం భూ సమస్యలను పరిష్కరిస్తాం: జేసీ



రీ సర్వే వివరాలు తెలుసుకుంటున్న జేసీ

రొంపిచర్ల, జూన్19 (ఆంధ్రజ్యోతి): ఈనాం భూముల సమస్యలను పరిష్కరి స్తామని జాయింట్ కలెక్టర్ సూరజ్ గురువారం తెలిపారు. రొంపిచర్ల తహసీల్దార్ కార్యా లయానికి గురువారం విచ్చేసిన ఆయన భూ రీ-సర్వే వివరాలను తహసీల్దార్ బండి నిర్మలను అడిగి తెలుసుకున్నారు. ఈనాం భూములను పట్టా మార్చటానికి వివరాలు సేకరిస్తాని చెప్పారు. వారం రోజుల్లోగా ఈ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే విప్పర్లపల్లి అగ్రహారం భూ సమస్యను మూడు నెలల్లో పరిష్కరిస్తామని జేసీ తెలిపారు. జిల్లాలోని 11 గ్రామాల్లో ఈ సమస్య ఉందని వెల్లడించారు. అన్నదాత సుఖీభవ నగదు జమ కోసం భూముల సమస్యను త్వరిత గతిన పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. సీనియర్ అసిస్టెంట్ జనార్దన్, వీఆర్వో యువరాజ్ ఉన్నారు.

37 ఆశ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రూరల్, అర్బన్ ప్రాంతాల్లో 37 ఆశ కార్యకర్తల నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్వో డాక్టర్ కె.విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను శుక్రవారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకు ఖాళీగా ఉన్న సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. గ్రామీణ/పట్టణ ఆరోగ్య పారిశుధ్య పౌష్టికాహార కమిటీ ద్వారా అందిన దరఖాస్తుల నుంచి ప్రతిభ కలిగిన అప్లికేషన్లు జిల్లా కార్యాలాయనికి పంపి, డిస్ట్రిక్ట్ హెల్త్ సొసైటీ ద్వారా నియామకాలు చేపట్టడం జరుగుతుందని డాక్టర్ విజయలక్ష్మి వెల్లడించారు.

'గోల్కొండ' టైమింగ్‌లో స్వల్ప మార్పు

గుంటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): (17202) సికింద్రాబాద్ - గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్ కాలమాన పట్టికలో రైల్వే శాఖ స్వల్ప మార్పులు చేసింది. ఈ నెల 23 నుంచి ఈ రైలు విజయవాడకు రాత్రి 7.20 గంటలకు వచ్చి 7.30కి బయలుదేరుతుంది. ఈ కారణంగా కృష్ణా కెనాల్‌కు రాత్రి 7.38 గంటలకు వచ్చి 7.40కి బయలుదేరుతుంది. ఇతర రైల్వే స్టేషన్ల కాలమాన పట్టికలో ఎలాంటి మార్పులు ఉండవని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

● మార్క్‌ఫెడ్ డీఎం నరసింహారెడ్డి ● స్పైసెస్ పార్కులో జిల్లా కొనుగోలు కేంద్రం



వివరాలు తెలుసుకుంటున్న మార్క్‌ఫెడ్ డీఎం నరసింహారెడ్డి

యడ్లపాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుగోళ్లు శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు మార్క్‌ఫెడ్ ఉమ్మడి గుంటూరు డీఎం నరసింహారెడ్డి తెలిపారు. యడ్లపాడు మండలంలోని స్పైసెస్ పార్కులో ఉన్న స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌కు చెందిన గిడ్డంగులను ఆయన గురువారం సందర్శించారు. మార్క్‌ఫెడ్, వ్యవసాయ, గిడ్డంగుల శాఖ అధికారులతో పొగాకు కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పైసెస్ పార్కులోని స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌కు చెందిన గోడౌన్లలో జిల్లా స్థాయి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు తగిన వసతులు ఇక్కడ ఉన్నాయన్నారు. రైతు సేవా కేంద్రాల్లో సీఎం యాప్ ద్వారా నమోదు చేసుకున్న రైతుల పొగాకును నిర్ణీత షెడ్యూల్ ప్రకారం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. పొగాకులో తేమ 20శాతానికి మించకూడదని, బేల్ బరువు 25 నుంచి 150 కేజీల లోపు ఉండేలా చూసుకోవాలని సూచించారు. రవాణా ఖర్చులు రైతులే భరించుకోవాలని, నాణ్యమైన పొగాకు ధర కేజీ రూ.120, తక్కువ నాణ్యత కలిగిన పొగాకు ధర రూ.60 నిర్ణయించినట్లు చెప్పారు. పొగాకును తప్పని సరిగా గ్రేడింగ్ చేసుకుని తీసుకురావాలని స్పష్టం చేశారు. గ్రేడింగ్ చేయకుండా తీసుకువస్తే తక్కువ ధర వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. చవుడు భూముల్లో పండించిన పొగాకులో నికోటిన్ లేనందున కొనుగోలు చేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పొగాకు కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి బి.మురళీకిషోర్, జిల్లా వ్యవసాయాధికారి మురళి, జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి, ఏడీఏ మస్తానమ్మ, ఏవో హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

సద్వినియోగం చేసుకోండి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభమవుతుందని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బోయపాలెం స్పైసెస్ పార్క్ ఆవరణలో ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. రైతులు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీ ఫార్మసీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



తనిఖీ చేస్తున్న సమన్వయకర్త సుబ్బారావు

పెదకాకాని, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో బీ ఫార్మసీ నాలుగో సంవత్సరం ఏడు, ఎనిమిదవ సెమిస్టర్ల (రెగ్యులర్, సప్లమెంటరీ) పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణకు గుంటూరు జిల్లాలో 16, ప్రకాశం జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎనిమిదవ సెమిస్టర్ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, ఏడవ సెమిస్టర్ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతున్నాయి. వర్సిటీ పీజీ, వృత్తి విద్యా కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు పరీక్ష కేంద్రాల్లో పరిశీలకుల నియామకంతో పాటు తనిఖీ బృందాలను నియమించారు. ఈ తనిఖీ బృందాలు గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని పలు కేంద్రాలను తనిఖీ చేపట్టాయి. ఆచార్య ఎం.సుబ్బారావు క్యాంపస్ కళాశాల పరీక్ష కేంద్రంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో చివరి బ్యాచ్ ఎనిమిదవ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయని చెప్పారు.

ఇద్దరి మృతికి బాధ్యులెవరు జగన్

టీడీపీ పల్నాడు అధ్యక్షుడు కొమ్మాలపాటి

సత్తెనపల్లి జూన్ 19(ఆంధ్రజ్యోతి): జగన్ బలప్రదర్శనలో ఇద్దరి మృతికి బాధ్యులెవరని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ ప్రశ్నించారు. గురువారం ఆయన మాట్లాడుతూ బలప్రదర్శన చేసి ప్రజల ప్రాణాలు తీసే హక్కు ఎవరిచ్చారని నిలదీశారు. ప్రజా సమస్యలు ఉంటే పోరాటాలు చేయాలే కానీ, ప్రజలను ఇబ్బంది పెట్టకూడదని హితవు పలికారు. చనిపోయిన ఇద్దరి కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించలేదన్నారు. రెంటపాళ్ళలో కూడా వైసీపీ నేత నాగమల్లేశ్వరరావు చనిపోయి ఏడాది తరువాత పరామర్శించడం స్వార్థం కోసం కాదా అని అయన ప్రశ్నించారు. అదికారంలో ఉన్నప్పుడు తాడేపల్లి ప్యాలెస్ దాటిరాని జగన్‌కు ప్రజలు ఇప్పుడు గుర్తొచ్చారని విమర్శించారు. టీడీపీ జిల్లా అదికార ప్రతినిధి కంబాల వెంకటేశ్వరరావు కూడా జగన్ చర్యలను ఖండించారు.

తీరు మార్చుకోకపోతే ప్రజలే తరిమి కొడతారు

ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి ఆంజనేయులు

వినుకొండ, జూన్-19, (ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి, వైసీపీ తీరు మారకపోతే ప్రజలే వారిని తరిమికొట్టే రోజులు త్వరలోనే వస్తాయని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హెచ్చరించారు. ఈ నెల 21న విశాఖలో జరగనున్న అంతర్జాతీయ యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా భీమిలీ నియోజకవర్గంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులాలు మతాలు మధ్య చిచ్చుపెట్టి అధికారం దక్కించుకోవాలనే చూసే కుట్రలను మానుకోవాలని హితవు పలికారు. రప్పా, రప్పా నరుకుళ్లు.. తప్పుడు కేసులు.. దౌర్జన్యాలు, దుర్మార్గాలు చేసినందునే 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితం అయ్యారనే విషయాన్ని గమనించాలన్నారు. ప్రజాస్వామ్య చట్టాలను గౌరవిస్తున్నామని, జగన్‌లా ఇళ్లకు తాళాలు వేసి బంధించడం లేదన్నారు. జగన్ హయాంలో రాజారెడ్డి రాజ్యాంగం నడిచింది కాబట్టే పల్నాడు జిల్లా ఆత్మకూరులో దళితులను గ్రామం నుంచి తరమేసి, పరామర్శించడానికి వెళ్లకుండా చంద్రబాబును అడ్డుకున్నారని మండిపడ్డారు. ఎప్పుడూ లేనిది కమ్మ సామాజికవర్గంపై కపట ప్రేమ చూపిస్తున్న జగన్.. అధికారంలో ఉన్నప్పుడు రెండవసారి మంత్రి వర్గం విస్తరణలో ఆ వర్గానికి ఒక మంత్రి పదవి కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బర్లీ సంబరం

(3వ పేజీ తరువాయి)

చేపట్టవద్దన్నారు. తొలిదశలో నాలుగు జిల్లాల పరిధిలో ఏడు కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ తెరిచిందని, వీటిని 15 వరకు పెంచే ఆలోచన ఉందన్నారు. స్లాట్ ప్రకారం పొగాకును కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. రైతులు తమ దగ్గర నిల్వలు లేవు అని చెప్పేవరకు కూడా కేంద్రాలు తెరిచే ఉంచాలన్నారు. ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ పొగాకు కొనుగోళ్లపై అసాధ్యాన్ని సుసాధ్యం చేశామన్నారు. పదిశాతం మంది పొగాకు రైతులు సాగు వివరాలను నమోదు చేసుకోలేదని అలాంటి వారివిషయంలో ఉదారంగా వ్యవహరించాలని వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్‌ను కోరగా ఎమ్మెల్యే కోరగా సానుకూలంగా స్పందించారు.

తొలి రోజు 101 క్వింటాళ్లు..

పర్చూరు యార్డులో బర్లీ పొగాకు కేంద్రం ప్రారంభించిన తొలి రోజు గురువారం 101 క్వింటాళ్ల కొనుగోలు చేసినట్లు మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ తెలిపారు. దాదాపు 12 లక్షల విలువైన కొనుగోళ్ల సాగాయి. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ ఎండీ మంజీర్ జిలాని, వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు, వేర్‌హౌసింగ్ డైరెక్టర్ సురేష్, కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యేలు కొండయ్య, బీఎన్ విజయ్‌కుమార్, బుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	204.00

23న సుపరిపాలన - స్వర్ణాంధ్ర



సమీక్షిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ, సీఆర్డీఏ కమిషనర్

తుళ్లూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా సుపరిపాలన - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ఈ నెల 23న వెలగపూడి రాష్ట్ర సచివాలం సమీపంలో నిర్వహించనున్నారు. గురువారం గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగ లక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు గురువారం ఏర్పాట్లపై పరిశీలన చేశారు. పగడ్బందీగా పనులు పూర్తి చేయాలని అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ నెల 12న కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా అహ్మదాబాద్ విమాన ప్రమాదం చోటుచేసుకోవడంతో వాయిదా పడింది. జిల్లా సంయుక్త కలెక్టర్ భార్గవ తేజ, సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ నవీన్‌కుమార్, ఆర్డీఏఓ శ్రీనివాసరావు, తుళ్లూరు డీఎస్పీ మురళీ కృష్ణ ఇతర అధికారులు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అన్ని జిల్లాల కలెక్టర్లు, చీఫ్, ప్రిన్సిపల్ సెక్రటరీలు, శాఖల కమిషనర్లు పాల్గొననున్నారు.

బాధిత రైతు కుటుంబాలకు అండగా ఉంటాం

● జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు



బాధిత రైతు కుటుంబంతో మాట్లాడుతున్న గాదె

గుంటూరు మెడికల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆత్మహత్యలకు పాల్పడిన మిరప, పత్తి రైతుల కుటుంబాలను జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు గురువారం పరామర్శించారు. చిలకలూరిపేట నియోజకవర్గం నాదెండ్ల గ్రామానికి చెందిన నాశం ఆదినారాయణ, తూబాడు గ్రామానికి చెదిన సిరిబోయిన గోపాలరావు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. స్థానిక జనసేన నాయకులతో కలసి ఆయా గ్రామాలకు వెళ్లి కుటుంబాలను కలసి, పరామర్శించి తమ సానుభూతిని గాదె వ్యక్తం చేశారు. మృతుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం, ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అండగా ఉంటారని ధైర్యం చెప్పారు. జనసేన జిల్లా సమన్వయకర్త తోట రాజ రమేష్, నాదెండ్ల ఉపాధ్యక్షుడు శరత్, సుభాని తదితరులు ఉన్నారు.

మన్నవకు సీఎం అభినందనలు!



సీఎం చంద్రబాబుతో ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ

గుంటూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ సంస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి.. సంస్థని అభివృద్ధి పథంలో నడవడానికి కృషి చేస్తున్న ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ సంస్థ చైర్మన్ మన్నవ మోహన కృష్ణను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం మోహన కృష్ణ సీఎంను కలిసి ఏపీటీఎస్‌లో నూతనంగా తీసుకొచ్చిన సంస్కరణలను వివరించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో నూతనంగా 26 కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఐటీ మేనేజర్ల ఎంపిక ప్రక్రియ జరుగుతోందని, సైబర్ సెక్యూరిటీ సేవలను మరింత విస్తృత పరుస్తున్నామని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఏపీ టీఎస్ సంస్థ అనేది ఒకటి ఉందని కూడా ప్రజలకి తెలియలేదని, అలాంటిది సీఎం ప్రోత్సాహంతో ఈ సంస్థ ప్రభుత్వానికి, ప్రజలకి వేవంతమైన సేవలు అందించేలా పని చేస్తోందని మన్నవ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

43,494 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 41,660 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 43,494 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,856 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11300
334	9500	13400	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	13200	334	9800	13300
273	10000	12400	నెంబరు. 5	10000	13300
341	10000	13500	273	----	----
4884	---	---	341	10000	13500
సూపర్ 10	---	---	సూపర్ 10	-----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14000	తేజ	10000	14200
షార్క్-1	---	---	బ్యాడిగి	10000	13300
బ్యాడిగి	10000	13000	దేవనూరు డీలక్స్	10000	13500
దేవనూరు డీలక్స్	10000	13000	తాలుకాయలు	4500	7000

కాకినాడ టౌన్, చర్లపల్లి, లింగంపల్లికి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మీదగా చర్లపల్లి, కాకినాడ టౌన్, లింగంపల్లికి ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. (07447) కాకినాడ టౌన్ - చర్లపల్లి ప్రత్యేక రైలు జూలై 5 నుంచి 2026 మార్చి 28 వరకు ప్రతి శనివారం రాత్రి 8.10కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా మరుసటి రోజు ఉదయం 8.30కి చర్లపల్లి చేరుకొంటుంది. (07448) చర్లపల్లి - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు జూలై 6 నుంచి మార్చి 29 వరకు ప్రతి ఆదివారం రాత్రి 7.30 గంటలకు బయలుదేరి పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 9 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. (07445) కాకినాడ టౌన్ - లింగంపల్లి ప్రత్యేక రైలు జూలై 2 నుంచి మార్చి 30 వరకు ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో రాత్రి 8.10కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా మరుసటి రోజు ఉదయం 8.50కి లింగంపల్లి చేరుకొంటుంది. (07446) లింగంపల్లి - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు జూలై 3 నుంచి మార్చి 31 వరకు ప్రతి మంగళ, గురు, శనివారాల్లో సాయంత్రం 6.30కి బయలుదేరి పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా ఉదయం 9 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకొంటుందని సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు.

48.10 ఎకరాలు.. పల్నాడులో భూసేకరణ

● గుంటూరు - బీబీనగర్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు
● 13 గ్రామాల్లో వేర్వేరు సర్వే నంబర్లలో రెండో రైలు మార్గం
● కాంపిటెంట్ అథారిటీగా సత్తెనపల్లి ఆర్డీఓ
● ల్యాండ్ ప్లాన్‌లు, గజిట్ నోటిఫికేషన్ జారీ

గుంటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - బీబీ నగర్ రెండో రైలు మార్గం ప్రాజెక్టు నిర్మాణంలో మరో కీలక అడుగు పడింది. ఇప్పటికే తెలంగాణలో కొన్ని సెక్షన్లలో భూమి అందుబాటులో ఉండటంతో నిర్మాణ పనులు ప్రారంభమైన విషయం తెలిసిందే. మరోవైపు గుంటూరు జిల్లాలో ఈ ప్రాజెక్టుకు సంబంధించి గతేడాదే భూ సేకరణ నోటిఫికేషన్లను రెవెన్యూ శాఖ జారీ చేసింది. ఇప్పుడు పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం వరకు భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ అయింది. ఈ విషయాన్ని దక్షిణ మధ్య రైల్వే గజిట్ నోటిఫికేషన్‌ని కూడా విడుదల చేసింది. భూములు కోల్పోయే యజమానుల అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈ భూ సేకరణ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కాంపిటెంట్ అథారిటీ సత్తెనపల్లి ఆర్డీవోని 30 రోజుల వ్యవధిలో సంప్రదించాలని సూచించింది.

భూ సేకరణ ఇలా..

పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలోని 13 గ్రామాల్లో గుంటూరు - బీబీ నగర్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు కోసం 48.10 ఎకరాల భూమిని ల్యాండ్ ప్లాన్ షెడ్యూల్స్ ప్రకారం సేకరించాల్సి ఉంది. గుడిపూడిలో 0.05, బీమవరంలో 0.390, సత్తెనపల్లిలో 3.28, ధూళిపాళ్లలో 8.10, కంకణాలపల్లిలో 2.065, రాజుపాలెంలో 1.51, రెడ్డిగూడెంలో 11.49, కుబాద్‌పురంలో 4.64, చౌటుపాపాయపాలెంలో 2.74, పెదకూరపాడులో 9.44, లింగంగుంట్లలో 3.82, చినమక్కెనలో 0.28, నాగిరెడ్డిపాలెంలో 0.99 ఎకరాలను వివిధ సర్వే నంబర్లలో సేకరించేందుకు భూ సేకరణ నోటిఫికేషన్‌ని ఇప్పటికే రైల్వే శాఖ విడుదల చేసింది. కాగా, ఇదివరకే గురజాల ఆర్డీఓ కార్యాలయం పరిధిలోని గ్రామాలకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియ ప్రారంభమై పూర్తి కావొస్తోంది. గుంటూరు ఆర్డీఓ పరిధిలోనూ దాదాపుగా తుది దశకు చేసుకుంది.

గేమ్ చేంజర్.. డబ్లింగ్ ప్రాజెక్టు

రైల్వేకు ఆదాయం తీసుకురావడం, ప్రయాణికులకు దేశంలోని వివిధ ప్రాంతాలకు రైల్ కనెక్టివిటీ పొందడం, అమరావతి రాజధానికి వివిధ ప్రాంతాల నుంచి రైళ్ల రాకపోకలు సాగించేందుకు గుంటూరు - బీబీ నగర్ డబ్లింగ్ ప్రాజెక్టు ఒక గేమ్ చేంజర్‌గా మారనుందన్న అభిప్రాయం రైల్వే వర్గాలు వ్యక్తపరుస్తున్నాయి. ప్రస్తుతం ఈ సెక్షన్‌లో నల్లపాడు నుంచి పగడిపల్లి వరకు సింగిల్ లేన్ మార్గం మాత్రమే అందుబాటులో ఉంది. దీని వల్ల రైళ్ల రాకపోకలకు క్రాసింగ్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో ప్రయాణ సమయం ఎక్కువగా ఉంటోంది. అదే డబ్లింగ్ పూర్తి అయితే ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. దాంతో పాటే కొత్త రైళ్లను ఈ మార్గంలో ప్రవేశపెట్టేందుకు రైల్వే శాఖ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలు మార్గం కూడా గుంటూరు - బీబీ నగర్ డబ్లింగ్‌కు న్యూ పిడుగురాళ్ల వద్ద జంక్షన్ ఏర్పడనుంది.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

పార్ట్ టైం పొలిటీషియన్ శవరాజకీయాలు

● జగన్‌పై దేగల ప్రభాకర్ ధ్వజం



గుంటూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): 'బెంగళూరు నుంచి పార్ట్ టైం పొలిటిషన్ వస్తాడు, ఇక్కడ శవ రాజకీయాలు, కుట్రలు, కుతంత్రాలు చేయడం, తిరిగి బెంగళూరు జంపవడం.. ఇదీ జగన్ రెడ్డి తీరు. జగన్ రెడ్డికి బీహార్ నుంచి వచ్చి అల్లర్లు చేసే ముఠాకి తేడా లేదు' అంటూ ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ జగన్‌పై విరుచుకుపడ్డారు. టీడీపీ నగర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కళ్లు మూసుకుని పాలు తాగే పిల్లి తనను ఎవరూ చూడడం లేదనుకున్నట్లుగా జగన్‌రెడ్డి తీరు ఉందన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని జగన్ ప్రచారం చేస్తున్నాడని మండిపడ్డారు. 'రాజారెడ్డి రాజ్యాంగం అమల్లోకి వస్తుంది.. అడ్డొచ్చిన వారిని రప్పా రప్పా నరుక్కుంటూ పోతాం..' అంటూ ప్లకార్డులతో ర్యాలీలు చేపట్టడం జగన్ రెడ్డి క్రిమినల్ ఐడియాలజీకి నిదర్శనం కాదా? అని ప్రశ్నించారు. వైసీపీ కుట్ర రాజకీయాలను ప్రజలు ఛీ కొడుతున్నా జగన్ అండ్ కోలో ఎటువంటి మార్పు రావడం లేదన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం జగన్ రెడ్డి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నరన్నారు. బెట్టింగ్ కట్టి ప్రాణాలు తీసుకున్న వ్యక్తి విగ్రహావిష్కరణ చేయడం ప్రపంచంలో ఎక్కడైనా ఉందా అని విస్మయం వ్యక్తం చేశారు.



ప్రసంగిస్తున్న రెంటాల కుమారి, పాల్గొన్న సీపీఐ నాయకులు

మహిళల రక్షణకు కఠిన చట్టాలు అవసరం

గుంటూరు(తూర్పు), జూన్ 19(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకు కఠినచట్టాలను రూపొందించాల్సిన అవసరముందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధానకార్యదర్శి రెంటాల కుమారి అన్నారు. స్థాని క కొత్తపేటలో గురువారం జరిగిన సమాఖ్య నగర మహాసభలో ఆమె మాట్లాడారు. దేశవ్యాప్తంగా మహి ళలపై లైంగిక దాడులు, హత్యలు పెరిగిపోతున్నా యన్నారు. దాడులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌ నంగా ఉండటం సరికాదన్నారు. అనంతరం సంఘ నగర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నగర అధ్యక్షురా లిగా గొట్టిముక్కల దుర్గ, కార్యదర్శిగా గుండెబోయిన లక్ష్మితోపాటు 11మంది కార్యవర్గాన్ని, 21మంది సమితి సభ్యులను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. కార్యక్రమంలో రాజవరపు కోటేశ్వరమ్మ, మాల్యాద్రి, నూతలపాటి చిన్న, ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు, చల్లా మరియా దాస్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ఫ్యాన్సీ మర్చంట్స్ అసోసియేషన్ సేవలు స్ఫూర్తిదాయకం

గుంటూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వేసవిలో నిరంతరం మజ్జిగ చలివేంద్రం నిర్వహిస్తున్న ది పట్ట ణ ఫ్యాన్సీ, స్టేషనరీ జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ సేవలు స్ఫూర్తిదాయకమని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు తెలిపారు. నాజ్ సెంటర్‌లోని అసోసియేషన్ కార్యాలయం ఎదుట మజ్జిగ చలివేంద్రం ముగింపు కార్యక్రమం సందర్భంగా ఆయన మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రంగా రామకృష్ణ, గొల్లపూడి కాశీ రాంబాబు, ఆతుకూరి నగేష్, వనమా నరేంద్ర తదితరులున్నారు.


22న జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు

గుంటూరు(తూర్పు), జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు, మాజేటి గురవయ్య హైస్కూల్ మైదానంలో ఈ నెల 22న అండర్-16 బాలుర విభాగంలో జిల్లా జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రికెట్ సంఘ త్రీ కమి టీ సభ్యులు మనోజ్ సాయి, మహతి శంకర్, సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఎంపికలకు సొంత కిట్‌లతో హాజర వ్వాలని తెలిపారు. 2011 లోపు పుట్టినవారు ఈ ఎంపికలకు అర్హులన్నారు. ఒరిజినల్ జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు.

సర్వేయర్ మాగోడు పట్టించుకోవడం లేదు

● జీఎంసీ ఆవరణలో బాధితురాలి నిరసన

గుంటూరు కార్పొరేషన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు సర్వేయర్ సుభాని, అతని అసిస్టెంట్ సిలార్ తమ గోడు పట్టించుకోవటం లేదని పాతగుంటూరు వడ్రనగర్‌కు చెందిన శ్రీలక్ష్మి అనే బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కార్పొరేషన్ ఆవరణలో బైఠాయించి ఆమె నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితురాలు శ్రీలక్ష్మి మాట్లాడుతూ మా తాత నుండి స్థలం కొనుగోలు చేశామని, దానికి సంబంధించి సర్వే సర్టిఫికెట్ కావాలని దరఖాస్తు చేసి మూడు నెలలుగా తిరుగుతున్నామన్నారు. మమ్మల్ని పట్టించుకోకుండా మా స్థలానికి సంబంధించి మరొకరికి ధ్రువపత్రం ఇచ్చేందుకు సిలారు, సర్వేయర్ సుభానిలు థర్డ్ పార్టీతో ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. తక్షణమే న్యాయం చేయాలని బాధితురాలు ఆవేదనవ్యక్తం చేశారు.



కార్పొరేషన్ ఆవరణలో నిరసన తెలియజేస్తున్న బాధితురాలు శ్రీలక్ష్మి

వైసీపీ కార్యకర్త మృతి కేసులో దర్యాప్తు ముమ్మరం

● అదుపులో కారు యజమాని, డ్రైవర్

గుంటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : జగన్ పల్నాడు పర్యటన సందర్భంగా గుంటూరు సమీపంలోని ఏటుకూరు బైపాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంగళాయపాలెనికి చెందిన ప్లంబర్, వైసీపీ కార్యకర్త చీలి సింగయ్య మృతి కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. ఇప్పటికే పోలీసులు ఈ ప్రమాదానికి కారణమైన కారును గుర్తించారు. ఆ కారు యజమాని విజయవాడ చెందిన వైసీపీ నాయకుడు దేవినేని అవినాష్‌కు అనుచరుడని తేలింది. కారు యజమాని హరీష్ అలియాస్ గోపీకృష్ణ, డ్రైవర్ సాయిబాబాలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

శివారు ప్రాంతాల్లో వసతుల కల్పన

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర



శంకుస్థాపన చేస్తున్న నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తదితరులు

గుంటూరు కార్పొరేషన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని మేయర్ కోవేలమూడి రవీంద్ర తెలిపారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో రూ.75.50 లక్షలతో అభివృద్ధి పనులకు గురువారం ఆయన ఎమ్మెల్యే నసీర్ మహ్మద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రోడ్లు, డ్రెయిన్ల ఏర్పాటుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ మేరకు పనుల నిర్వహణకు అనుమతులు మంజూరు చేశామన్నారు. నగరంలో డివిజన్ల వారీగా కార్పొరేటర్ల నుండి వసతులపై ప్రతిపాదనలు తీసుకొని ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడుతున్నామన్నారు. గత ప్రభుత్వంలో తూర్పు నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక దృఢత్వం



యోగా చేస్తున్న భాష్యం రామకృష్ణ, విద్యార్థులు

గుంటూరు(విద్య), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): యోగాతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగా దృఢత్వం ఏర్పడుతుందని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో మూడు రోజుల యోగోత్సవ్ కార్యక్రమాన్ని ఇన్నర్ రింగురోడ్డులోని భాష్యం గరుడ క్యాంపస్‌లో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలు సైతం యోగాను ఆచరించి అద్భుతమైన ఫలితాలను పొందుతున్నాయన్నారు. విశ్రాంత వ్యాయామ శిక్షణాధికారి ఆళ్ల రాజేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేస్తే ఏకాగ్రత, లక్ష్యసాధనలో ఉన్నత ఫలితాలను సాధించవచ్చన్నారు. యోగాంధ్రలో భాగంగా భాష్యం అన్ని బ్రాంచీలలో యోగా విద్యార్థులతో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్‌చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్‌లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి సమస్య పరిష్కరిస్తాం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించేదుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. గుం టూరులోని తన కార్యాలయంలో గురువారం ఆమె ప్రజల నుంచి వినతిప్రత్రాలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, అభివృద్ధి కార్యక్రమాలకు పాతరవేసిందన్నా రు. శానిటేషన్, వీధిదీపాలు, కుక్కల బెడ ద సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు.

గుజ్జనగుండ్లలో ఇరువర్గాల ఘర్షణ

● ఇద్దరికి తీవ్ర గాయాలు... పరిస్థితి విషమం

గుంటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గుజ్జనగుండ్ల మసీదు సెంటర్లో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. తొలుత వారం క్రితం గుజనగుండ్లకు చెందిన నాగూర్‌భాష, ఖాజాల మధ్య గొడవ జరిగింది. బుధవారం రాత్రి మసీదు సెంటర్లో ఖాజా కనిపించగా పాతగొడవ విషయమై నాగూర్‌బాష నిలదీశాడు. దీంతో నాగూర్‌బాషాకు స్నేహితులైన రసూల్, మహబూబ్ సుభాని అనే అన్నదమ్ములు ఖాజాపై గొడవకు వెళ్లారు. విషయం తెలుసుకున్న ఖాజా సోదరుడు షారోన్ కూడా వచ్చాడు. దీంతో ఇరు వర్గాలు బీరు బాటిళ్ళు, కత్తితో పొడుచుకున్నారు. ఈ దాడిలో రసూల్‌కు, ఖాజాకు తీవ్ర గాయాలు కాగా వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఇరువురు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్య

గుంటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్ ఎల్ఆర్ కాలనీ 3వ లైనుకు చెందిన నడికట్ల శివారెడ్డి(22) గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యం మత్తులో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడా లేక మరే ఇతర కారణాలు ఉన్నాయా అనేకోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా తన కుమారుడు మద్యం మత్తులో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లి నడికట్ల లక్ష్మీదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లాలాపేట స్టేషన్ నుంచి అనుమానితుడి పరార్

సెల్‌ఫోన్ల చోరీ కేసుల్లో అనుమానితుడు పెద్ది రాజు లాలాపేట పోలీస్ స్టేషన్ నుంచి పరారయ్యాడు. మంగళదాస్‌నగర్‌కు చెందిన రాజు సెల్‌ఫోన్ల చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు గురువారం అతడ్ని స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌పైకి తీసుకువెళుతుండగా రాజు పోలీసులను నెట్టి పరారయ్యాడు. దీంతో పోలీసులు రాజు కోసం గాలిస్తున్నారు.

నేడు శ్రీరాఘవేంద్రస్వామి 44వ వార్షికోత్సవం

గుంటూరు(తూర్పు), జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట శ్రీ రామవేంద్రస్వామి బృందావనంలో ఉడిపి శ్రీకృష్ణమఠం, గురురాజ సేవాసమితి వారి ఆధ్వర్యంలో శుక్రవారం జగద్గురు శ్రీరామవేంద్రస్వామి మృత్తికా బృందావన 44వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ఉదయం పాద పూజ, ప్రధాన హోమం, కలశాభిషేకం, పంచామృతం, పూర్ణాహుతి, సాయంత్రం రంగపూజ, పల్లకి, రథసేవలు, ఉయ్యాల సేవ జరుగుతాయని తెలిపారు.

పోలీసులు అదుపులో సైకో కిల్లర్స్

● తెనాలిలో కలకలం రేపుతోన్న నేరాలు

● నెలన్నర క్రితం ఇదే తరహాలో మరో వృద్ధురాలి హత్య... దోపిడీ

గుంటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఒంటరి మహిళలే లక్ష్యంగా తెనాలిలో దోపిడీలు, హత్యలకు పాల్పడుతున్న సైకో కిల్లర్స్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. గురువారం తెనాలి పరిమి డొంకలో ఇద్దరు వృద్ధ మహిళలను దారుణంగా హత్య చేసి దోచుకున్న ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ హత్యలకు పాల్పడింది మారీస్‌పేట పరిధిలోని రవీంద్రనగర్‌ప్రాంతానికి చెందిన వారిగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఇద్దరు యువకులు, మరో మహిళ కలసి ఈ దారుణానికి పాల్పడినట్లు గుర్తించిన పోలీసులు ఇప్పటికే వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇదే తరహాలో సుమారు నెలన్నర క్రితం అదే ప్రాంతంలో ఓ వృద్ధురాలిని హత్య చేసి బంగారు ఆభరణాలు దోచుకున్నట్లు తాజాగా వెలుగు చూసింది. కుమార్తెలు ఆమె ఒంటిపై గాయాలు ఉండడం, బంగారం మాయం కావడంతో అప్పట్లో అనుమానించినా పోలీసులకు ఫిర్యాదు చేసే ధైర్యం చేయలేకపోయారు. తాజాగా దాసరి రాజేశ్వరి, పేట అంజమ్మ అనే వియ్యపురాళ్లను బంగారు ఆభరణాల కోసమే హత్య చేసినట్లు తేలింది. పోలీసులు అనుమానిస్తున్న నిందితులు ఉన్న ప్రాంతానికి సమీపంలోనే నెలన్నర క్రితం తమ తల్లి మృతి చెందిన నేపథ్యంలో ఇదే తరహాలో హత్యకు గురైనట్లు ఆమె కుమార్తెలు అనుమానించారు. దీంతో గురువారం రాత్రి ఆ వృద్ధురాలి కుమార్తెలు తెనాలి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో పోలీసులు సైకో కిల్లర్స్ చేసిన నేరాలపై మరింత లోతుగా ఆరా తీస్తున్నట్లు తెలిసింది. గతంలో ఈ తరహాలో సైనైడ్ హత్యలకు పాల్పడిన మహిళ, అదేవిధంగా మహిళను ట్రాప్ చేసి విషం కలిపి హత్య చేసి దోచుకున్న మరో మహిళ ముఠా ఉదంతాలు మరువక మునుపే ఈ సైకో కిల్లర్స్ హత్యలు వెలుగులోకి రావడంతో తెనాలివాసులు ఉలిక్కిపడుతున్నారు.

ఈ కామర్స్‌తో వ్యాపారాభివృద్ధి మరింత సులభం



మాట్లాడుతున్న వాల్‌మార్ట్ ప్రతినిధి ప్రసాద్, వేదికపై ఆంజనేయులు, యేల్బూరి తదితరులు

గుంటూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సాంకేతికత యుగంలో ఈ కామర్స్‌తో వ్యాపారాభివృద్ధి మరింత సులభతరమవుతుందని ఈ కామర్స్ వ్యాపార రంగ నిపుణుడు ప్రసాద్ తెలిపారు. ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో వాల్‌మార్ట్, ఫ్లిప్ కార్ట్ సౌజన్యంతో నాజ్ సెంటర్‌లోని ది పట్టణ ఫ్యాన్సీ, స్టేషనరీ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో గురువారం వ్యాపారులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చిన్న, మధ్య తరహా పరిశ్రమలతోపాటు చిన్నపాటి వ్యాపారులు కూడా తమ వ్యాపారాన్ని పట్టణం, నగరానికే పరిమితం కాకుండా మరింత విస్తృతం చేసేందుకు ఈ కామర్స్ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. వాల్‌మార్ట్ ప్రతినిధి మణికంఠ మాట్లాడుతూ వాల్‌మార్ట్, ఫ్లిప్ కార్ట్ ద్వారా ఈ కామర్స్‌తో చిన్న, మధ్య తరహా పరిశ్రమల వ్యాపారం అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తాయన్నారు. జీఎస్‌టీ లైసెన్స్‌లు పొంది ఉన్న వారు ఫ్లిప్‌కార్ట్ సంస్థలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు మాట్లాడుతూ వ్యాపారులు ఈ కామర్స్‌పై అవగాహనతో వ్యాపారాభివృద్ధి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు యేల్బూరి వెంకటేశ్వర్లు, చాంబర్ సభ్యులు ఆతుకూరి నగేష్, తూనుగుంట్ల నాగేశ్వరరావు, గొల్లపూడి కాశీ వెంకటరాంబాబు, రంగా రామకృష్ణ తదితరులున్నారు.

పడకేసిన పారిశుధ్యం


● రోడ్లపై గుట్టలుగుట్టలుగా చెత్తాచెదారం

● దుర్గంధంతో రహదారులు

● పట్టించుకోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు



వెంకటరమణ కాలనీలో



రవీందర్‌నగర్‌లో రోడ్డు పక్కన వ్యర్థాలు

గుంటూరు కార్పొరేషన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్యం పడకేసింది.. ప్రధాన రహదారులు సైతం చెత్త, చెదారంతో నిండి ఉంటున్నాయి.. అనేక రహదారులపై గుట్టలు గుట్టలుగా చెత్త కవర్లతో నిండి ఉంది... అధ్వానంగా రహదారులు మారినప్పటికీ పారిశుధ్యాన్ని మెరుగుపరచాల్సిన శానిటరీ ఇన్స్పెక్టర్లు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో గుంటూరు నగరంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది.

గుంటూరు నగరంలో సుమారు 2750 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు. వీరందరిపై నగరంలోని 207 సచివాలయల్లో 207మంది శానిటేషన్ కార్యదర్శులు ఉన్నారు. నగరాన్ని 25 డివిజన్‌లుగా శానిటేషన్‌ను విభజించి 25 మందిని శానిటరీ ఇన్స్పెక్టర్‌లను నియమించారు. మీరు కాక శానిటేషన్ సూపర్వైజర్లు, ఎంహెచ్‌వోలు, సీఎంహెచ్‌వోలు, డిప్యూటీ కమిషనర్లు ఉన్నారు. ఎంత మంది ఉద్యోగులు ఉన్నప్పటికీ నగరంలో పారిశుధ్యం మాత్రం ఏమాత్రం మెరుగుపడటం లేదు. అందుకు ప్రధాన కారణం శానిటరీ ఇన్స్పెక్టర్లు అవినీతిమయంగా మారటమేనని తెలుస్తుంది. ఎంతమంది పారిశుధ్య కార్మికులు విధులకు హాజరవుతున్నారనేది కేవలం ఐరిష్‌లో మాత్రమే ఉంటుంది. వారంతా ఎక్కడ పని చేస్తున్నారో ఎవరికి తెలియదు. వాస్తవానికి గుంటూరు నగరంలో పారిశుధ్యం పిన్ పాయింట్ ప్రోగ్రాం ప్రకారం తిరగాల్సి ఉంది. ఇది ఎక్కడా అమలు కావడం లేదు. దీంతో నగరంలో పారిశుధ్యం అధ్వానంగా మారడం మాత్రమే కాకుండా పారిశుధ్య కార్మికుల జీతభత్యాలు, ఇతర అలవెన్స్ అన్ని జీఎంసీకి భారంగా మారుతున్నాయి. నగరంలో కొందరు శానిటరీ ఇన్స్పెక్టర్లు నెలకు రెండు లక్షలు సంపాదిస్తున్నారు. పర్మినెంట్ కార్మికుల వద్ద నెలకు రూ.10,000 తీసుకుంటున్నారు. ప్రైవేట్ పారిశుధ్య కార్మికుల వద్ద ఒక్కొక్కరి వద్ద రూ.1000 తీసుకుంటున్నారు. దీంతో డివిజన్లో శానిటరీ ఇన్స్పెక్టర్లకు నెలకు 2 లక్ష రూపాయలు పైనే అక్రమ సంపాదన ఉందనే ఆరోపణలుఉన్నాయి. ఇవికాక ఆయా డివిజన్ పరిధిలో షాపుల వద్ద, టిఫిన్ బళ్ల వద్ద, రోడ్డు పక్కన చిరు వ్యాపారుల వద్ద భారీగా డబ్బులు తీసుకుంటున్నారు. పారిశుధ్య కార్మికులు లెక్కకు పనిలో ఉంటున్నారు కానీ ఎక్కడా కూడా పనిచేయరు. ఆ విధంగా మేనేజ్ చేసినందుకు శానిటరీ ఇన్స్పెక్టరుకు నెలకు లక్షల్లో సమర్పిస్తున్నారు. దీంతో నగరంలో పారిశుధ్యం అధ్వానంగా మారుతోంది. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నగరంలో పారిశుధ్యం పిన్ పాయింట్ ప్రోగ్రాం కింద జరిగేలా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.



ఎన్జీవో కాలనీ దగ్గర..



సీతమ్మ కాలనీలో..



ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌తో సమావేశమైన సైంటిస్ట్ సుందరరాజన్, నిపుణుల బృందం

ఆహార పదార్థాల నిల్వ సామర్థ్యం పెంపుపై కృషి

● శాస్త్రవేత్త సుందర్‌రాజన్

గుంటూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రిఫ్రిజిరేటర్లో పెట్టిన ఆహారపదార్థాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండేలా వాటి సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామని శాస్త్రవేత్త సుందర్‌రాజన్ చెప్పారు. గుంటూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌ను ఆహార పదార్థాల శాస్త్రవేత్త సుందర్ రాజన్, ఫుడ్ ప్యాకింగ్ నిపుణులు పొదిలి వెంకటరాయుడు తదితరులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించుకున్నారు. తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఆహారపదార్థాల మీద జరుపుతున్న పరిశోధనలపై శాస్త్రవేత్తల కృషిని అభినందించారు. సరికొత్త ఆవిష్కరణలు తెచ్చి వినియోగదారులకు మంచి ఆహారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో దాసరి రాజమాష్టారు, పొదిలి నళిని, కె.శివరామయ్య, వడ్డే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆదర్శ నాయకుడిగా పవన్‌కల్యాణ్

● పోస్టర్లు ఆవిష్కరించిన జనసేన నేతలు

గుంటూరు మెడికల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శక, జవాబుదారీతనంతో పాలన సాగిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ దశాబ్దపు ఆదర్శ ప్రజానాయకుడిగా వినుతికెక్కారని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ల హరి తెలిపారు. ఉప ముఖ్యమంత్రిగా పవన్‌కల్యాణ్ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా శ్రీనివాసరావుతోటలో గురువారం ఆయన గోడ ప్రతులను ఆవిష్కరించారు. గత వైసీపీ నియంతృత్వ, అరాచక పాలనను అంతమొందించడంలో పవన్‌దే కీలక పాత్ర అన్నారు. అవినీతి, అక్రమాలకు ఏమాత్రం తావు లేకుండా సుపరిపాలన చేస్తున్న పవన్ కల్యాణ్‌కు ప్రజలు తమ హృదయాల్లో ప్రత్యేక స్థానం ఇచ్చారని ఆళ్ల హరి తెలిపారు. కార్యక్రమంలో నాజర్‌వలి, మెహబూబ్ బాషా, కొత్తకోట ప్రసాద్, నండూరి స్వామి, బాలకృష్ణ, శేషు, ఉదయ్‌చంద్ర, బద్రిశెట్టి రాంబాబు, షంషేర్ పాల్గొన్నారు.

పంచభూతాలలో విశిష్టమైనది వాయువు



మాట్లాడుతున్న డాక్టర్ నాగరాజ్యలక్ష్మి

గుంటూరు(తూర్పు), జూన్ 19(ఆంధ్రజ్యోతి): పంచభూతాలలో వాయువు ఎంతో విశిష్టమైనదని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వెలువోలు నగరాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక బృందావన గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మహిళా విభాగపు ప్రత్యేక కార్యక్రమం జరిగింది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు చిటిపోతు మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. డాక్టర్ నాగరాజ్యలక్ష్మి ప్రసంగిస్తూ ప్రాణి మనుగడకు ఊపిరి వాయువన్నారు. మన పూర్వీకులు వాయువును దేవతాశక్తిగా భావించి పూజించారని వేదమంత్రాలతో వివరించారు. ముఖ్యఅతిథి ప్రముఖ కథా రచయిత్రి గోటేటి లలితాశేఖర్ నేటికథ - ఈనాటి మహిళ అనే అంశంపై ప్రసంగిస్తూ సాంస్కృతికంగా మహిళ జీవితంలో ఎదురైన మార్పులను పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మైలవరపు లలితకుమారి, విజయలక్ష్మి, డాక్టర్ మాధవపెద్ది విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ మనుగడ కోసమే పరామర్శ యాత్రలు

గుంటూరు(తూర్పు), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాజకీయ మనుగడ కోసమే జగన్ పరామర్శ యాత్రలు చేస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు కొర్రపాటి సురేష్ తెలిపారు. నగరంపాలెంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బెట్టింగ్‌లో ప్రాణాలు కోల్పోయిన వారికి విగ్రహాలు, పరామర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. గత ఏడాది చనిపోతే ఇప్పుడు జగన్ నానా హంగామా చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. సత్తెనపల్లిలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అంబటి రాంబాబుతో కలిసి జగన్ ఇటువంటి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



విష్ణుశర్మ మృతదేహం

గుంటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక హజారువారి వీధికి చెందిన విష్ణు శర్మ(66) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. 18న మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో వీధిలో అపస్మారక స్థితిలో పడి పోయి ఉండటం చూసిన స్థానికులు లాలాపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు పరిశీలించి అతడు మృతి చెందినట్లు నిర్ధారించి దేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల వివరాలు తెలిసిన వారు 8688831311, 8688831313 నెంబర్లను సంప్రదించాలని పోలీసులు కోరారు.

అతిగా మద్యం తాగి కార్పెంటర్...

స్థానిక శారదాకాలనీ 28వ లైనుకి చెందిన కార్పెంటర్ కర్నాటి గోపి(34) అనే వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. మద్యానికి బానిసై కొన్ని రోజుల నుంచి తీవ్రంగా మద్యం తాగుతున్నాడు. 19న కూడా ఫూటుగా మద్యం తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలించగా వైద్యులు పరీక్షించి చనిపోయినట్లుగా నిర్ధారించారు. మృతుడి భార్య కర్నాటి జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు.

పల్నాడు బస్టాండ్ సెంటర్‌లో వ్యక్తి అనుమానాస్పద..

స్థానిక పల్నాడు బస్టాండ్ సెంటర్‌లో జంగాల సిద్ధయ్య అలియాస్ రేణుక స్వామి(71) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ప్రత్తిపాడు మండలం ఈదులపాలెం గ్రామానికి చెందిన సిద్ధయ్య గుంటూరులో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తుంటాడు. అనారోగ్య కారణంగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. 17న మధ్యాహ్నం గుంటూరు వచ్చాడు. తర్వాత పల్నాడు బస్టాండ్ వద్ద అపస్మారక స్థితిలో పడి ఉండగా 108లో జీజీహెచ్‌కు స్థానికులు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. సిద్ధయ్య భార్య జంగాల బోడెమ్మ ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

రాహుల్‌గాంధీ నాయకత్వం యువతకు స్ఫూర్తి

● జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి

గుంటూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): దేశానికి మార్గం చూపే నాయకుడిగా, నేటి తరం యువతకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నాయకత్వం స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి తెలిపారు. పొన్నూరు రోడ్డులోని కార్యాలయంలో గురువారం రాహుల్‌గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా మస్తాన్‌వలి మాట్లాడుతూ సమాజంలో సామాజిక న్యాయం, సమానత్వం కోసం పోరాడుతున్న నిజమైన నిస్వార్థ నాయకుడు రాహుల్‌గాంధీ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా, కాంగ్రెస్ నాయకులు అంబటి రత్తయ్య, మోషే, షైలా కిరణ్, రామకృష్ణ పలువురు నాయకులున్నారు.

● యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కట్టా జవహర్‌బాబు ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదినం పురస్కరించుకొని పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో కేక్ కట్‌చేసి పుస్తకాలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె పవన్‌తేజ, పగడాల ప్రసాద్, నీలం జయరామ్, బన్నీ, ఆలీ, షఫీ, వెంకట్, హరికృష్ణ, హేమంత్ పాల్గొన్నారు.

వినూత్నం..ఆదర్శం.!

ఎప్పుడూ పండించే పంటలే సాగు చేస్తే ఏమొస్తుంది! అవే ఖర్చులు, చాలీచాలని ఆదాయం. అదే కొత్త పంటలు, సరికొత్త సాగు పద్ధతులతో వ్యవసాయం చేస్తే?... వ్యవసాయానికి వ్యవసాయం.. ఆదాయానికి ఆదాయం. ఇదే బాటలో పయనిస్తున్నారు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని కొందరు రైతులు. పురుగు మందులు లేకుండా ప్రకృతి సిద్ధంగా పండించిన పంటలు ఆరోగ్యంతోపాటు, మంచి లాభాలు పొందొచ్చని నిరూపిస్తున్నారు. కొంతమంది మన ప్రాంతాల్లో పండవని, సాగు లాభదాయకం కాదని నిన్నటి వరకు వెనకడుగు వేసిన పరిస్థితుల్లో ధైర్యం చేసి డ్రాగన్ ఫ్రూట్, హైబ్రీడ్ నేరేడు వంటి సరికొత్త పంటలను పండిస్తున్నారు. మరికొందరు ఆధునిక వంగడాలు కాకుండా మన పూర్వీకులు పండించిన, అంతరించిపోతున్న వంగడాలను ప్రకృతి సిద్ధంగా పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వాటిని కాపాడుకునేందుకు కొందరు రైతులు కలసి ఏకంగా విత్తన బ్యాంక్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్


దేశవాళీ విత్తన సాగు

తెనాలి: గ్రాఫిక్ డిజైనింగ్‌లో పీజీ చేశాడు. రూ.క్షలు జీతం వచ్చే ఉద్యోగాన్ని వదులుకుని వారసత్వంగా వచ్చిన వ్యవసాయాన్ని నమ్ముకున్నాడు. తనకు తోడు మరికొందరు రైతుల్లో చైతన్యం నింపాడు. అందరితో కలసి ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం చుట్టాడు అత్తోటకు చెందిన ఎర్రు బాపారావు(బాపన్న) అనే యువ రైతు. అందులోనూ రసాయనిక అవశేషాలు లేని ఆహారాన్ని జనానికి అందించాలనే లక్ష్యంతో ప్రకృతి వ్యవసాయాన్ని ఎంచుకున్నారు వారంతా. హైబ్రిడ్ వంగడాల వరిలోనూ లోటుపాట్లు ఉన్నాయని భావించి పూర్వీకులు పండించిన దేశీయ వరి వంగడాలపై దృష్టి పెట్టారు. ఈ వంగడాలు అందుబాటులో లేకపోయినా, 'మన ఊరు .... మన విత్తనం' అనే నినాదంతో అతి కష్టం మీద వంద రకాల వరి విత్తన రకాలను సేకరించారు. ఆ విత్తనాలను తమ తోటి రైతులకు అందించారు. వాటి ద్వారా దేశవాళీ వరి వంగడాలను పండించి, దేశీయ విత్తనాన్ని అభివృద్ధి చేసి.. విత్తన నిధిని ఏర్పాటు చేశారు. నల్ల ధాన్యం, చింతలూరు సన్నం, సముద్ర లహరి, సిద్ధ సన్నం, తులసీబాసో వంటి 52 రకాల వరి వంగడాలను పరిరక్షించే దిశగా సాగు చేపట్టారు. ఇప్పటికే వారు పండించిన పంట నుంచి విత్తనాలను ఇతర ప్రాంతాల రైతులకోసం ఉచితంగా అందించి సాగు విస్తీర్ణం పెంపునకు శ్రీకారం చుట్టారు. అత్తోటకు చెందిన ఈ రైతులు తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



నల్లధాన్యం

పై పొట్టు, బియ్యం కూడా నల్లగా ఉంటడం ఈ పంట విశిష్టత. 120 రోజుల ఈ పంట ఎకరాకు 25 బస్తాలు దిగుబడినిస్తోంది. మధుమేహం ఉన్నవారికి ఈ ధాన్యం మంచిదని నానుడి.



సముద్ర లహరి

130 రోజుల కాల వ్యవధి. ఉప్పు నేలల్లో సైతం పండటం విశేషం. ఎకరాకు 25 బస్తాల దిగుబడి వస్తుంది. ఆరోగ్యం, ఆదాయం మెండుగా ఉంటుంది.



చింతలూరు సన్నం

ధాన్యం ఎర్రగా ఉండి, బీపీటీ తరహాలో ఉంటుంది. 120 రోజుల పంట. ఎకరాకు 25 బస్తాల దిగుబడి వస్తుంది. సన్నగా, తెల్లగా ఉండే ఈ బియ్యం ఆరోగ్యానికి మంచిదని చెబుతారు.



దేశవాళీ వరి విత్తన కంకులతో అత్తోట రైతులు



రేగిపండ్ల పంట



తోటవద్ద పండ్లు అమ్ముతున్న రైతు

తీరంలో రేగిపంట.. భలే గిరాకీ

రేపల్లె, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలో రేపల్లెకు చెందిన రైతు సురేష్ నగరం మండలం మంత్రి పాలెం సమీపంలో రెండెకరాల విస్తీర్ణంలో ఎవరూ సాగు చేయని రేగి పంట పండిస్తున్నాడు. ఎకరాకు రూ.లక్షపైనే పెట్టుబడి పెట్టి మొక్కలు పెట్టాడు. మూడేళ్లకు పంట కాపుకొచ్చింది. గతేడాది చెట్టుకు 200నుంచి 300కాయలు వరకు కాచాయి. కిలో రూ.50 చొప్పున అమ్మకాలు జరిపారు. ఒక్కసారి పెట్టుబడి పెడితే ఏటా చెట్లను సరిపడా నీరు పెట్టుకుని బతికించుకోవడం, తెగుళ్ల నివారణకు మందులు వాడుకుంటే సరిపోతుంది. 20 ఏళ్ల పాటు దిగుబడి వస్తుంది. అయితే మార్కెటింగ్ చేసేందుకు అనువైన ప్రాంతం లేకపోవడంతో కొంతమేర ఇబ్బంది ఉంది. మార్కెటింగ్ అవకాశం ఉంటే అధిక లాభాలు సంపాదించవచ్చని రైతు సురేష్ తెలిపారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగుతో ఆదాయం

దుగ్గిరాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల మండలం మంచికలపూడి గ్రామంలో ఎకరం విస్తీర్ణంలో రైతు యార్లగడ్డ చలమయ్య డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నారు. మూడేళ్ల క్రితం నరసరావుపేట సమీపంలోని సాతులూరులో మొక్కలను తెచ్చి వేశానని 40 సెంట్లలో వేశానని, లాభసాటిగా ఉండటంతో ఈ ఏడాది మరో 60 సెంట్లలోనూ సాగుచేస్తున్నానని చెప్పారు. ఏడాదికే కాయ కోతకు వస్తుందని, ఏడాదిలో ఆరు నెలలు మాత్రమే కాపు ఉంటుందని రైతు చెబుతున్నారు. గతేడాది రూ.లక్షన్నర వరకూ ఆదాయం వచ్చిందని, కిలో రూ.80 నుంచి రూ.300 ఈ ఫలం వరకూ ధర పలుకుతోందని చెప్పారు. ఎకరాకు 2వేల మొక్కలు వరకూ వేసుకోవచ్చునని, ఒక్కోమొక్క రూ.35కు కొనుగోలు చేశానని చెప్పారు. పశువుల ఎరువు, వేప నూనె మాత్రమే ఇప్పటి వరకూ వినియోగిస్తూ వచ్చానని.. రూ.5లక్షల వరకూ ఎకరాకు ఖర్చవుతోందని రైతు చలమయ్య తెలిపారు. 15 ఏళ్ల పాటు పంట చేతికి వస్తుందని వివరించారు. ఒక మొక్క దెబ్బతింటే దాని స్థానంలో మరోమొక్క తెచ్చి పెట్టుకోవచ్చునని చెప్పారు. మన నేలకు సరిపోదేమోనని కొందరు రైతులు తనను భయపెట్టారని, ధైర్యంచేసి సాగుచేసినందుకు లాభసాటిగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.





డ్రాగన్ ఫ్రూట్, బొప్పాయితో లాభాలు

మాచర్లటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పల్నాడు రైతులు ఉద్యావన పంటలు వైపు మొగ్గు చూపుతున్నారు. వాణిజ్య పంటలు వేసి నష్టపోయి.. పండ్ల తోటలతో లాభాల బాట పడుతున్నారు. మాచర్ల నియోజకవర్గంలో డ్రాగన్ ఫ్రూట్, బొప్పాయి, దానిమ్మ పంటలు సాగు చేస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్స్‌ను వెల్దుర్తి మండలం ఉప్పలపాడులో 2, గుండ్లపాడు 7, మాచర్లలోని జమ్మలమడకలో 7, రాయవరంలో 3, రెంటచింతల మండలంలో 7 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ఈ ఏడాది అధికంగా బొప్పాయి వందెకరాల్లో సాగు చేస్తున్నారు.

పురుగు మందులు లేని ఆహారం లక్ష్యం

పిడుగురాళ్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పురుగు మందుల అవశేషాలు లేని ఆహారాన్ని అందించడమే తమ లక్ష్యమని మాచవరం మండలం కొత్త గణేశుని పాడుకు చెందిన ఆదర్శ రైతు పొందూరి నరసింహారావు, దాచేపల్లి మండలం నడికూడికి చెందిన కోగంటి శివన్నారాయణ చెబుతున్నారు. కొత్తగణేశునిపాడులోని ఐదెకరాల విస్తీర్ణంలో డ్రాగన్ ఫ్రూట్, ఉసిరి, అరటి తోటలు, చేపలు, కోళ్ల పెంపకం, బ్లాక్ రైస్‌ను పండించడమే కాకుండా.. పొరుగు రాష్ట్రాలకూ సరఫరా చేస్తూ.. పలుమార్లు ఆదర్శ రైతుగా గుర్తింపు పొందారు. నాలుగేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయం ద్వారానే పంటలు సాగు చేస్తూ రైతులకు అందిస్తున్నాడు. నడికుడిలో కోగంటి శివన్నారాయణ మామిడి, నిమ్మ, జామ, సపోట, వాటర్ యాపిల్‌ను వేప గింజల కషాయం, గోమూత్రం ఎరువుతో పంటలను పండిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.



నరసింహారావు



శివన్నారాయణ

క్వారీ భూముల్లో వడ్డెర్లకు..

సముచిత స్థానంపై హర్షం

గుంటూరు(తూర్పు), జూన్ 19(ఆంధ్రజ్యోతి): క్వారీ భూముల్లో వడ్డెర్లకు సముచిత స్థానం కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయంపై ఏపీ వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లె ఈశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు, హౌసింగ్ బోర్డు కాలనీలోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో వడ్డెర్లకు ఇచ్చిన హామీని అమలు చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో కుల వృత్తుల వడ్డెర్లు అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. బీసీ బలహీన వర్గాలను అన్ని విధాలుగా వైసీపీ అణచివేసిందని విమర్శించారు. ఏడాది పాలనలో వడ్డెర్ల అభ్యున్నతి, సంక్షేమానికి చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. త్వరలోనే వడ్డెర్ల సంక్షేమానికి రూపొందించిన కార్యచరణను ప్రకటిస్తామని తెలిపారు. ఛైర్మన్ పదవి ఇచ్చిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, పెమ్మసాని చంద్రశేకర్, గల్లా మాధవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న మల్లె ఈశ్వరరావు

ప్రముఖ సాహితీవేత్త పులిచెర్ల కన్నుమూత

గుంటూరు విద్య, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత, సాహితీవేత్త, జేకేసీ కళాశాల పూర్వం తెలుగు అధ్యాపకుడు డాక్టర్ పులిచెర్ల సాంబశివరావు (78) అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. సాంబశివరావుకు భార్య భారతి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. డాక్టర్ పులిచెర్ల 1969 నుంచి 2004 వరకు జేకేసీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేశారు. మహారాణా ప్రతాప్ జీవితాన్ని నవల రూపంలో తెలుగు పాఠకులకు అందించారు. వీరపాండ్య కట్ట బ్రహ్మన జీవితాన్ని వీరి అన్న దివంగత పులిచెర్ల సుబ్బారావు నాటక రూపంలో అందించగా సాంబశివరావు నవలగా మలిచారు. దివంగత మన్నవ గిరిధరరావు ప్రారంభించిన భారతీయ మార్గము మాసపత్రిక నిర్వహణను కొనసాగించారు. పత్రికలో రామాయణాన్ని సరళమైన భాషలో తెలుగు పాఠకులకు అందించారు. అది గ్రంథ రూపంలో ప్రచురితమైంది. జాతీయ సాహిత్య పరిషత్ తాండూరు శాఖ డాక్టర్ ఓగేటి అచ్యుత రామశాస్త్రి జాతీయ సాహిత్య పురస్కారం అందజేసి సాంబశివరావును సత్కరించారు. కొన్నాళ్లు విజయవాడలో సమాలోచన నిర్వహించిన కథా రచయితల సమ్మేళనం సార్వజనిక సభకు సాంబశివరావు అధ్యక్షులుగా వ్యవహరించారు. భద్రాచలంలో జాగృతి పత్రిక నిర్వహించిన కథా రచయితల సమ్మేళనంలోనూ వీరి మార్గదర్శనం లభించింది. తుమ్మల సీతారామమూర్తి చౌదరి కళాపీఠం ద్వారా వారి రచనలన్నిటినీ పునర్ముద్రణ చేయించారు. ఇలా తెలుగు సాహితీ రంగానికి సాంబశివరావు ఎన్నో సేవలందించారు. స్థానిక అరండల్ పేట 17వ లైన్ లోని పులిచెర్ల సాంబశివరావు నివాస గృహంలో ప్రముఖులు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



డాక్టర్ పులిచర్ల సాంబశివరావు

పామాయిల్ దిగుమతి సుంకం పెంచాలి

గుంటూరు(తూర్పు), జూన్ 19(ఆంధ్రజ్యోతి): పామాయిల్ దిగుమతి సుంకాన్ని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనది కాదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అభిప్రాయపడ్డారు. సుంకాన్ని 40 శాతానికి పెంచేలా చర్యలు తీసుకోవాలని గురువారం గుంటూరు, చుట్టుగుంటలోని ఉద్యాన శాఖ కార్యాయలంలో కమిషనర్ టి.శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రసాదు మాట్లాడుతూ సుంకాన్ని తగ్గిస్తే ఇతర దేశాల నుంచి పెద్ద ఎత్తున పామాయిల్ దిగుమతి జరుగుతుందన్నారు. దీంతో స్థానిక రైతులు ఆర్థికంగా నష్టపోతారని తెలిపారు. డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు పెట్టుబడి ఇతర ఖర్చులకు 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధరగా ప్రకటించాలన్నారు. కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, పామాయిల్ రైతుల సంఘం కార్యదర్శి ఫుల్లారి సోమశేఖరాచార్యులు, వివిధ సంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేత

కొంగొత్తగా.. సందడి







గుంటూరు జిల్లా పెదకాకాని మండలం గోళ్ళమూడి చెరువు వద్ద కొంగలు సందడి చేశాయి. ప్రకృతి ప్రేమికులను ఇవి విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రతిరోజు భారీ సంఖ్యలో చెరువు వద్దకు కొంగలు వస్తాయి. ఆహారసేకరణ సమయంలో కొంగల విన్యాసాలు, లయబద్ధ విహంగం కనువిందు చేస్తున్నాయి. వీటి కదలికలను, అందాలను వీక్షిస్తూ ప్రజలు.. ఆస్వాదిస్తున్నారు.

- గుంటూరు (ఆంధ్రజ్యోతి)

చేనేతకు సహకారం అందించాలి

● ఏడేళ్ల నుంచి లేని సహకార సంఘాల ఎన్నికలు ● ప్రభుత్వం నుంచి రూ.కోట్లలో బకాయిల పెండింగ్
● సంఘాల నుంచి కార్మికులకు అందని సహకారం ● ప్రభుత్వం జీఓ ఇచ్చిన.. అందని విద్యుత్ రాయితీ



ఇసుకపల్లిలోని చేనేత సహకార సంఘ భవనం

రేపల్లె, జూన్ 19(ఆంధ్రజ్యోతి): దేశంలో వ్యవసాయం తర్వాత అతిపెద్ద ఉపాధి కల్పనగా గుర్తింపు పొందిన చేనేత పరిశ్రమ పాలకుల నిర్లక్ష్యానికి బలవుతుంది. చేనేత రంగాన్ని పరిరక్షిస్తామంటూ ఎన్నికల సందర్భంగా చేస్తున్న వాగ్దానాలు ఆచరణలో అమలుకు నోచుకోకపోవడంతో మగ్గాన్ని నమ్ముకుని జీవిస్తున్న చేనేత కార్మికులు ఆకలి కేకలు పెడుతున్నారు. చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయడం లేదు. పవర్ లూమ్ యాజమానులు కేటాయించిన వస్త్రాలను తయారు చేస్తున్న కార్మికులు మార్కెట్ దెబ్బతినడంతో ఉపాధిని కోల్పోతున్నారు.

సహకార సంఘాలకు ఎన్నికలు జరపాలి

ఏడేళ్లుగా చేనేత సహకార సంఘాలకు పాలక వర్గ ఎన్నికలు నిర్వహించలేదు. నామినేటెడ్ బోర్డుల ప్రత్యేక అధికారుల పాలన పేరుతో పాలక ప్రభుత్వాలు కాలం గడుపుతున్నాయి. దీంతో సహకారసంఘాలు పలు సమస్యలను ఎదుర్కొంటున్నాయి. పాలకవర్గాలు లేకపోవడంతో కార్మికులకు చేతినిండా పని చూపలేకపోతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 72 సహకార సంఘాలు ఉండగా 11 వేల మంది చేనేత కార్మికులు పనిచేస్తున్నారు. చేసిన పనికి మజూరీ సకాలంలో చెల్లించకలేకపోవడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చేనేత సహకార సంఘాలకు పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలని గత పాలక ప్రభుత్వాలకు మొరపెట్టుకున్న ఆలకించిన దాఖలాలు లేవని చేనేత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైన ప్రత్యేక దృష్టి సారించి ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నారు.

అమలుకాని ఉచిత విద్యుత్

కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే చేనేత కార్మికులకు నెలకు 200, పవర్ లూమ్ కార్మికులకు 500 యూనిట్లు ఉచితంగా విద్యుత్ అందిస్తామని వాగ్దానం చేసింది. సంవత్సరం కాలంగా ఇప్పటికి ఉచిత విద్యుత్ అమలుకు నోచుకోలేదు. ఉచిత విద్యుత్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసి మూడు నెలలు అయ్యినప్పటికి.. కార్మికుల గృహాల్లో విదుత్ వెలుగులు కనిపించడం లేదు.

ఏడేళ్లుగా అందని బకాయిలు

ఏడేళ్లుగా చేనేత సంఘాలకు ప్రభుత్వం నుంచి వివిధ రాయితీల రూపంలో రావాల్సిన రూ.172 కోట్లు బకాయిలు విడుదల కాలేదు. దీంతో సహకార సంఘాలు కార్మికులకు పని చూపించలేని దుస్థితిలో కునారిల్లుతున్నాయి. ఏడేళ్లుగా రాష్ట్రంలో సంఘాలకు ప్రభుత్వం చెల్లించాల్సిన పావలా వడ్డీ వంటి బకాయిలు చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

ప్రభుత్వం తోడ్పాటు అందించాలి



కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తరువాత చేనేత పరిశ్రమపై జీఎస్టీ విధించడంతో ఆ ప్రభావం పరిశ్రమపై తీవ్రంగా పడింది. నేత కులవృత్తిగా నమ్ముకుని బతుకు సాగిస్తున్న వారిని సంక్షోభంలోకి నెట్టింది.

- జి.బాలాజీ, ఏపీ చేనేత కార్మిక సంఘం సహాయ కార్యదర్శి

సంఘాలకు ఎన్నికలు జరగాలి

చేనేత సహకార సంఘాలకు ఏడేళ్లుగా ఎన్నికలు నిర్వహించలేదు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి ఎన్నికలు జరిపించాలి. కార్మికులకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాల్సిన పాలక ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించకుండా కాలయాపన చేస్తోంది.

- కె.వీరమోహన్‌రావు, చేనేత కార్మికుడు

దాతృత్వం.. పరాధీనం

● ఆరు వందల ఎకరాలకు.. మిగిలింది మూడు వందలే

మూతపడిన అనాథ శరణాలయం



పిల్లుట్లలోనే జీవీజీకేఆర్‌వో హైస్కూల్

పిల్లుట్ల(మాచవరం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మాచవరం మండలంలోని పిల్లుట్ల అనాథ శరణాలయం కొన్నేళ్లుగా మూతపడింది. 1922లో పిల్లుట్ల గ్రామానికి చెందిన తండ్రి, కొడుకులు .. అనాథలు, వితంతువుల సంక్షేమం కోసం వారికి ఉన్న ఆరు వందల ఎకరాల భూములను మిగిలిన స్థిర, చర ఆస్తులను జీవీజీకేఆర్‌వో ఎస్టేట్‌కు ధారాదత్తం చేశారు. ఐతే కొంత మంది దురాలోచనల వల్ల ఆరు వందల ఎకరాల భూమి నేడు మూడు వందల ఎకరాలకు కుచించుకుపోయింది. జీవీజీకేఆర్‌వో హైస్కూల్‌లో విద్యాబుద్ధులు నేర్చుకున్న అనేక మంది నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. కానీ వినోభావావే భూ ధానోద్యమానికి అంకురార్పణ జరగలేదు. గుర్రం వీరారెడ్డి, పేరమ్మ దంపతులకు కలిగిన నలుగురు సంతానం అకాల మృత్యువు పాలయ్యారు. ముగ్గురు కుమార్తెలకు వివాహాలు జరిగిన కొద్ది కాలానికే మృతి చెందారు. దీంతో తల్లడిల్లి పోయిన వీరారెడ్డి కొడుకు కృష్ణారెడ్డి పై ఆశలు పెట్టుకున్నాడు. కాకినాడలోని పీఠాపురం రాజావారి కళాశాలలో చేరిన కృష్ణారెడ్డి.. కందుకూరి వీరేశ లింగం, చిలకమర్తి లక్ష్మీ నరసింహం, గురజాడ అప్పారావు తదితర సంఘ సంస్కర్తల ఆశయాలకు ప్రభావితుడయ్యారు. పిల్లుట్ల గ్రామంలో కూడా సంస్కరణలు ప్రవేశ పెట్టేందుకు కృష్ణారెడ్డి కృషి చేశారు. కానీ, ఆయన తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. ఈ క్రమంలో కృష్ణారెడ్డి తండ్రి వీరారెడ్డిని పిలిచి చేతిలో చేయి వేయించుకున్నాడు. తనను బతికించుకునేందుకు మీరు చేసిన అన్ని ప్రయత్నాలు విఫలయ్యాయని, ఈ పాటి వైద్యం కూడా చేయించుకోలేని అభాగ్యులు, అనాథలు సమాజంలో ఎందరో ఉన్నారని గుర్తు చేస్తూ.. తమ యావదాస్తిని వారి సంక్షేమం కోసం దానం చేయాలని కోరారు. తండ్రి వీరారెడ్డి, 1922 నవంబరు 22న మృతి చెందిన కుమారుడి చివరి కోరిక తీర్చేందుకు నడుం కట్టారు. జీవీజీకేఆర్‌వో ఎస్టేట్‌ను ఏర్పాటు చేసి స్థిర, చరాస్తులన్నింటినీ దానికి స్వాధీనం చేశారు. ఇందు కోసం ఒక కమిటీని ఏర్పాటు చేశారు. కొడుకు చనిపోయిన 32 రోజులకు తండ్రి వీరారెడ్డి కూడా తనువు చాలించాడు. కొంత కాలం తర్వాత జీవీజీకేఆర్‌వో ఎస్టేట్‌ను కమిటీ దేవదాయ శాఖకు అప్పగించింది. దేవదాయ శాఖకు అప్పగించే సమయానికి మూడు వందల ఎకరాలు మాత్రమే మిగిలింది. అందులో కూడా సుమారు 150 ఎకరాలు ప్రస్తుతం బీడు భూములుగా ఉన్నాయి. మిగిలిన 150 ఎకరాలు వేలం పాటల ద్వారా కౌలుకు ఇస్తున్నారు. కేవలం సంవత్సరానికి రూ.7 లక్షలు మాత్రమే కౌలు ద్వారా ఎస్టేట్‌కు ఆదాయం వస్తుంది. అప్పట్లో అనాథ శరణాలయం విరాజిల్లినప్పటికీ నేడు మూత పడి పోయింది. ప్రస్తుతం ఆర్థిక వనరులు లేక మూత పడినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. జీవీజీకేఆర్‌వో హైస్కూల్‌లో పని చేసే ప్రైవేట్ ఉపాధ్యాయులకు కొద్దో గొప్పో జీతాలు ఇస్తున్నారు.



పిల్లుట్లలో ఏర్పాటు చేసిన దాతల విగ్రహాలు

రూ.7 లక్షలు కౌలు వస్తుంది : ఈవో శ్రీనివాసరెడ్డి

పిల్లుట్ల జీవీజీకేఆర్‌వో ఎస్టేట్ కింద ఉన్న భూములకు సంవత్సరానికి రూ.7 లక్షలు మాత్రమే కౌలు వస్తుందని ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నగదుతో ఏటా కృష్ణారెడ్డి, వీరారెడ్డి జ్ఞాపకార్థం జయంతి, వర్ధంతి సభలు జరుపుతామని, వితంతువులకు దుస్తులు పంపిణీ చేస్తామని, స్థానిక సిబ్బందికి జీత భత్యాలు ఇస్తున్నామని వెల్లడించారు.



మూతపడిన అనాథ శరణాలయం గదులు




రాజమహేంద్రవరంలో జరిగిన సత్యమేవ జయతే దీక్షలో భువనేశ్వరి గారు


రాజమహేంద్రవరంలో అమరావతి రైతులతో భువనేశ్వరి గారు


చంద్రబాబు గారి అరెస్ట్‌తో గుండెపోటుతో చనిపోయిన వ్యక్తి కుటుంబానికి భరోసానిస్తున్న భువనేశ్వరి గారు


జగ్గంపేటలో జరిగిన నిరసన దీక్షలో మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న భువనేశ్వరి గారు


కాంతితో క్రాంతి నిరసనలో ఢిల్లీలో పాల్గొన్న భువనేశ్వరి గారు


తిరుపతిలో జరిగిన నిజం గెలవాలి సభలో మాట్లాడుతున్న భువనేశ్వరి గారు

తెలుగు వారికి ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చిన నట సార్వభౌమ
డాక్టర్ ఎన్.టి.ఆర్. గారి కుమార్తెగా, ఐ.టీకి కొత్త హంగులు అద్ది లక్షలాది కుటుంబాల్లో
వెలుగులు నింపే ఆదర్శనేత శ్రీ చంద్రబాబు నాయుడు గారి అర్ధాంగిగా,
మంత్రిగా ఏ శాఖ చేపట్టినా ఆ శాఖకు కొత్త వన్నె తీసుకువచ్చే
నేటి యువతరానికి ఐ కాన్ లోకేష్ బాబు గారి తల్లిగా ,
యావత్ ఆంధ్రులు అమ్మ అని అభిమానంగా పిలుచుకునే మానవతామూర్తి

నారా భువనేశ్వరి గారికి ఇవే మా జన్మదిన శుభాకాంక్షలు.

గత పాలకుల పుణ్యామా అని రాష్ట్రంలో అలముకున్న అక్రమ కేసుల చీకటి రోజుల్లో
నిజం గెలవాలి అంటూ ఆంధ్రప్రదేశ్‌లోని ఊరు.. వాడా పర్యటించి దగా పడిన గుండెల్లో
భువనమ్మ నింపిన ధైర్య, సాహసాలు అనిర్వచనీయం. అటువంటి స్ఫూర్తి వంతురాలు
నిండు నూరేళ్లు చల్లగా జీవించాలని ఆకాంక్షిస్తూ...



కందుల శ్రీనివాసరావు- మాధవి

ENTREPRENEUR, గురజాల నియోజకవర్గం - పిడుగురాళ్ళ

లైఫ్ టైం టిడిపి సభ్యులు

కుమార్తె : ప్రజ్ఞశ్రీచౌదరి కుమారుడు : జస్వంత్‌శ్రీ చౌదరి

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో గురువారం జరిగిన వేలంలో 142 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.8,000, గరిష్ఠధర రూ.10,550, మోడల్‌ధర రూ.10,505 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,430, గరిష్ఠధర రూ.10,550, మోడల్‌ధర రూ.10,505 పలికాయి.

నేడు రెవెన్యూ దినోత్సవం

తాడేపల్లి టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం రెవెన్యూ దినోత్సవం నిర్వహిస్తామని తహసీల్దార్ సీతారామయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు, సిబ్బంది, ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు.

● పెదనందిపాడు (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డే వేడుకలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హెనప్రియ గురువారం తెలిపారు. ప్రజలకు విశిష్ట సేవలందించిన పలువురు రెవెన్యూ సిబ్బందికి అభినందన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

● కాకుమాను, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ డే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటస్వామి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ రికార్డులు ప్రదర్శించే స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రజల దరఖాస్తు చేసుకున్న ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

● దుగ్గిరాల, (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అవగాహన సదస్సును ప్రజలు సద్వినియోగించుకోవాలని తహసీల్దార్ సునీత కోరారు. ప్రజలు ఆన్‌లైన్‌లో అర్జీలు పెట్టుకుంటే సంబంధిత ధ్రువీకరణపత్రాలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు.

డ్రెయినేజ్‌ల్లో పూడిక తీత పనులు ప్రారంభం

వట్టిచెరుకూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభాన్ని దృష్టిలో ఉంచుకొని డ్రెయినేజ్‌లో నీటి ప్రవాహానానికి తీవ్ర ఆటంకంగా ఉన్న ప్రాంతాల్లో అధిక ప్రాధాన్యమిస్తూ పూడికతీత పనులు ప్రారంభించినట్టు బాపట్ల డ్రెయినేజ్ డీఈ ధనలక్ష్మి వెల్లడించారు. మండలంలోని అనంతవరప్పాడు గ్రామ సమీపంలోని గుంటూరు ఛానల్ నుంచి ప్రారంభమయ్యే డ్రెయినేజ్‌లో గుర్రపు డెక్క, జమ్ము పెనవేసుకు పోయి నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకంగా ఉన్నాయి. ఇటీవల రైతుల విజ్ఞప్తి మేరకు బాపట్ల డివిజన్ డ్రెయినేజ్ డీఈ ధనలక్ష్మి, ఏఈ సుజాతలు డ్రెయినేజ్ దుస్థితిని పరిశీలించి పూడిక తీత పనులకు ప్రతిపాదనలు చేశారు. ఈ నేపథ్యంలో గుంటూరు ఛానల్ నుంచి అనంతవరప్పాడు, లేమల్లెపాడు గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డు వంతెన వరకు పూడిక తీత పనులను రెండు రోజుల క్రితం ప్రారంభించారు. అలాగే మండలంలోని ముట్లూరు, కాకుమాను మండలం పరిధిలోని కొల్లిమర్ల పరిసర


అనంతవరప్పాడు - లేమల్లెపాడు గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ వంతెన నుంచి సర్‌ప్లస్ కోర్సులో పూడిక తీసిన కాలువ

ప్రాంతాల్లోని సాగు భూములకు నష్టం జరుగకుండా ఉండేందుకు కొమ్మమూరు కాల్వ పక్కనే ఉన్నటువంటి డ్రెయినేజ్‌ని రెండు కిలోమీటర్ల మేర అత్యవసర పూడిక తీతకు నిధులు మంజూరైనట్టు ధనలక్ష్మి


ఆర్‌అండ్‌బీ వంతెన నుంచి వట్టిచెరుకూరు వరకు పెనవేసుకు పోయిన డ్రెయినేజ్ దుస్థితి

వివరించారు. వట్టిచెరుకూరు మండలం పలు గ్రామాల పరిధిలోని సాగు భూములు ముంపునకు గురి కాకుండా కొల్లిమర్ల సమీపంలోని కొమ్మమూరు కాలువ లాకుల వద్ద పూర్తి స్థాయిలో పూడిక తీయటం ద్వారా సాగు భూములు నీటి ముంపునకు గురి కాకుండా దోహద పడుతుందని ఆమె తెలపారు. పూడిక తీత పనులను ఏఈ సుజాత పరిశీలిస్తూ సదరు గుత్తేదారుకు పూడికతీత పనుల్లో ఎలాంటి అలసత్వం వద్దని ఆమె సూచించారు.

ఖరీఫ్ సీజనులో రైతులకు సూచనలు చేయాలి

● ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్

మేడికొండూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఖరీఫ్ సీజను ప్రారంభమవుతున్నందున వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి తగిన సూచనలు చేయాలని ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్ సూచించారు. మేడికొండూరులో గురువారం జరిగిన మండల ప్రజా పరిషత్ సమావేశంలో ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. మండల గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు స్థానిక సమస్యలను ఏకరవు పెట్టారు. ప్రధానంగా సిరిపురం, పేరేచర్ల క్వారీ ప్రాంతాల్లో తాగు నీటి సమస్యతో ప్రజలు పలు రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని, గత సమావేశంలో ఈ విషయాన్ని సభ దృష్టికి తీసుకు వచ్చినప్పటికీ పరిష్కరించలేదని పంచాయతీ వార్డు సభ్యులు చెప్పారు. మండల గ్రామీణ అభివృద్ధి రక్షిత మంచినీటి పథకం అధికారి సుజాత ఈ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో డ్రైనేజీలు, సిమెంట్ రోడ్లు, వీధి దీపాలు సమస్యలు ఉన్నట్లయితే వాటిని గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఎంపీపీ అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే డేవిడ్ ప్రభాకర్ ఈవోపీఆర్‌డీ పాటిబండ్ల పూర్ణ శంకరరావు, పరిపాలన అధికారి జే శ్రీనివాసరావు, మేడికొండూరు జడ్పీటీసీ కందుల సిద్దయ్య తదితరులతో పాటు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్ మేళా

మేడికొండూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో మేడికొండూరు మండలం, విశదల సమీపంలోని ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి సంజయ్ గురువారం తెలిపారు. జాబ్ మేళాను ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ప్రారంభించనున్నారని ఆయన తెలిపారు. జాబ్ మేళాకు జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొననున్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్ ఆధార్‌కార్డు నకలుతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో హాజరు కావలసిందిగా తెలిపారు. వివరాలకు వెంకట్ అల్లూరి 8919508017, రామకృష్ణారెడ్డి 7731982861 తదితరులను నేరుగా కాని లేదా ఫైఫోన్ నంబర్లను సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చునని తెలియజేశారు.

యోగా భారతీయుల వారసత్వ సంపద : ఎంపీడీవో



యోగాంధ్రపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో యుగకీర్తి

కాకుమాను, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): యోగా భారతీయుల వారసత్వ సంపద అని ఎంపీడీవో యుగకీర్తి అన్నారు. స్థానిక విష్ణాలయంలో ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో యుగకీర్తి మాట్లాడుతూ అందరి జీవితాల్లో యోగా భాగం కావాలని తెలిపారు. తహసీల్దార్ వెంకటస్వామి మాట్లాడుతూ ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలంటే యోగా సాధనే ఉత్తమం అన్నారు. ఎంఈవో కెన్నడీ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దోహదం చేస్తుందన్నారు. యోగా సాధన ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 విజయభాస్కరరావు, ఈవోపీఆర్డీ రవికుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యోగా డేని విజయవంతం చేయాలి : ఎంపీడీవో సమతావాణి

తాడికొండ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవో కే.సమతావాణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలపరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో నిర్దేశించిన ప్రదేశాల్లో యోగా దినోత్సవాన్ని నిర్వ హించాలని సూచించారు. యోగా దినోత్సవంలో గ్రామస్థులు పాల్గొనేలా చూడాలని తెలిపారు. యోగా, ధ్యానం ప్రాముఖ్యాన్ని వివరించాలని కోరారు. మండలపరిధిలోని గ్రామాల్లో నిర్వహించే యోగా దినోత్సవాన్ని పర్యవేక్షించడానికి అధికారులను నియమించినట్లు తెలిపారు. 21వ తేదీ ఉదయం 6.30 గంటలకు యోగా కార్యక్రమం ప్రారంభంకావాలని ఆదేశించారు.

తెలుగు యువత అధ్యక్షుడిగా బోగి వినోద్


బోగి వినోద్, వంగర హనుమాన్

మంగళగిరి సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడిగా బోగి వినోద్ నియమితులయ్యాడు. ఈ మేరకు గురువారం నియోజకవర్గ తెలుగుయువత పట్టణ అధ్యక్షులను పార్టీ వర్గాలు ప్రకటించాయి. ఇప్పటివరకు పట్టణ అధ్యక్షుడిగా పనిచేసిన వినోద్‌ను నియోజకవర్గ అధ్యక్షుడిగా ప్రకటించారు. అలాగే, మంగళగిరి పట్టణ అధ్యక్షుడిగా వంగర హనుమాన్‌కుమార్‌ను నియమించారు. వినోద్, హనుమాన్ నియామకంపై పలువురు నేతలు అభినందనలు తెలియజేశారు.

అప్పాపురంలో బైక్ చోరీ

కాకుమాను, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ అపహరణకు గురైన ఘటన అప్పాపురంలో బుధవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన ఎం వేణుగోపాలరావుకు చెందిన హోండా షైన్ ద్విచక్ర వాహనం ఇంటి ముందు పార్కు చేయగా అర్ధరాత్రి సమయంలో దొంగలు బైక్‌ను అపహరించుకుపోయారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వేణుగోపాలరావు ఫిర్యాదు చేయగా ఎస్ఐ పృథ్వీ ఏకనాథ్ సంఘటన స్థలానికి చేరుకుని గ్రామంలో బస్టాండ్ సెంటర్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

వికసిత భారత్

ఫిరంగిపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురంలో గురువారం వికసిత్ భారత్ కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. దేశ ప్రధానిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టి 11 సంవత్సరాలు పూర్తయిన సదర్భంగా ఈ కార్యక్రమాన్ని జరిపారు. బీజేపీ రాష్ట్ర హెడ్ క్వార్టర్స్ ఇన్‌చార్జ్ మకుటం శివ మాట్లాడుతూ దేశం అన్ని రంగాల్లో స్వయం సమృద్ధిని సాధించిందని అన్నారు. తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య మాట్లా డుతూ రైలు రవాణా, విమానయానం, రోడ్లు, వ్యవసాయం లాంటి అనేక రంగాల్లో అప్రతిహతంగా అభివృద్ధి సాధిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు విశ్వనాథుని హరిబాబు, జిల్లా కోశాధికారి రావూరి నారాయణరావు, మండల ప్రధాన కార్యదర్శి మనోరంజన్‌రెడ్డి, కోటేశ్వరరావు, చంద్రశేఖరరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

కాకుమాను, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వ్యయప్రయాసలకు ఓర్చి రైతులు సాగు చేసిన పొగాకును వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాకుమానులోని విష్ణాలయంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పొగాకు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలన్నారు క్వింటాల్ రూ.12 వేల ధరకు కొనుగోలు చేస్తేనే రైతులకు గిట్టుబాటు అవుతుందన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు రాజేంద్ర, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

పివా బలోపేతానికి కృషి చేస్తా : లక్ష్మీపెరుమాళ్లు

మంగళగిరి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ (పివా) బలోపేతానికి కృషి చేయడంతోపాటు పేద చేనేతల అభ్యున్నతి కోసం పాటుపడ తానని పివా మంగళగిరి శాఖ అధ్యక్షుడు తాటిపాముల లక్ష్మీపెరుమాళ్లు చెప్పారు. ఇటీవల పివా అధ్యక్షుడిగా నియమితులైన లక్ష్మీపెరుమాళ్లను ఆంజనేయ కాలనీవాసులు గురువారం రాత్రి ఘనంగా సన్మానించారు. అఖిల భారత పద్మశాలీయ సంఘం జాతీయ కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు మాట్లాడుతూ పివా కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళగిరి కొలనుకొండ వద్ద పద్మశాలి భవన్ నిర్మాణం జరుగుతుందని, అందులో పేద విద్యార్థులకు వసతిగృహం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమానికి దాతలు సహకరించాలని కోరారు. అఖిల భారత భక్త మార్కండేయ శ్రీశైలం పద్మశాలి అన్నసత్రం ఉపాధ్యక్షుడు గంజి రవీంద్రనాథ్ మాట్లాడుతూ తొలి నుంచి పేద ప్రజల ఉన్నతి కోసం పాటు పడుతున్న లక్ష్మీపెరుమాళ్లు పివా ద్వారా మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శలా సత్యనారాయణ, జొన్నాదుల వెంకట కోటేశ్వరరావు, జొన్నాదుల నాగమల్లేశ్వరరావు, అలుగూరి రాజశేఖర్, మండ్రు శ్రీను, తిరందాసు నాగేశ్వరరావు, దామర్ల ప్రసాద్, తుమ్మా సర్వేశ్వరరావు, మండ్రు సదాశివరావు, గద్దె శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయాలు కొనసాగిస్తాం : జంగాల అజయ్‌కుమార్

పెదనందిపాడు జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : బాలినేని సుబ్బారావు, బొగ్గవరపు బాపనయ్య ఆశయాలు కొనసాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. మండలపరిధిలోని ఉప్పలపాడు సీపీఐ కార్యాలయంలో జరిగిన బాలినేని సుబ్బారావు 53వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత గ్రామ పురవీధుల్లో అమరవీరులకు జోహార్ అర్పిస్తూ ర్యాలీ నిర్వహించి ఆయన విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదల తరఫున భూమికోసం, భుక్తికోసం ఆయన చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఉప్పలపాడు గ్రామానికి 17 సంవత్సరాలపాటు సర్పంచ్‌గా తన సేవలు అందించి గ్రామాభివృద్ధికి పాటు పడ్డారని తెలిపారు. సీపీఐ ఆయన అడుగుజాడల్లో నడిచి పేదలపక్షాన పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమానికి రామినేని నాగేశ్వరరావు అధ్యక్షత వహించాడు.

డయేరియాతో ఒక్కరు కూడా మరణించకూడదు

● జిల్లా రోగ నిరోధక టీకాల అధికారి శ్రావణ్‌బాబు

దుగ్గిరాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): డయేరియాతో ఒక్క మరణం కూడా సంభవించకుండా పీహెచ్‌సీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా రోగ నిరోధక టీకాల అధికారి ఏ శ్రావణ్‌బాబు అన్నారు. దుగ్గిరాల, ఈమని, పెదవడ్లపూడి పీహెచ్‌సీ ఆరోగ్య, ఆశా కార్యకర్తలతో సమీక్ష గురువారం నిర్వహించారు. శ్రావణ్‌బాబు మాట్లాడుతూ 0నుంచి ఐదేళ్లలోపు వయస్సు గల్గిన ఒక్కో పిల్లవాడికి రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 14 జింక్ ట్యాబ్లెట్లు అందిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రప్రభుత్వం కూడా అన్ని జిల్లాలు, అన్ని పీహెచ్‌సీల్లోనూ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ఎంతమంది డయేరియాతో బాధపడుతున్నారని, ప్రమాదకర పరిస్థితులేమైనా ఉన్నాయా, ఎలాంటి ఆహారం తీసుకోవాలి, పరిసరాల్లో పారిశుధ్య సమస్యలేమైనా ఉన్నాయా అనే అంశాలను పరిశీలించాలన్నారు. డయేరియా రావడానికి కారణాలు ప్రజలకు తెలియజేయాలన్నారు. డాక్టర్ అబ్దుల్‌రహ్మాన్, సునీత, వంకదార సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో మొక్కలకు వర్మీవాష్


రాజధానిలో సీడ్ యాక్సెస్ రోడ్డు మీద మొక్కలకు వర్మీవాష్ చేస్తున్న డ్రోన్

తుళ్లూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం ప్రారంభమైన తరుణంలో రాజధాని అమరావతిలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) మొక్కలకు పోషకాలు అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ప్రధానంగా అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డుపై ఉన్న పూల మొక్కలకు అధికారులు డ్రోన్‌ల ద్వారా వర్మీవాష్ చేస్తున్నారు. ఆర్గానిక్ పోషకాలను మొక్కలకు అందించడానికి ఈ వర్మీవాష్ తోడ్పడుతుంది. ముఖ్యంగా డ్రోన్ల ద్వారా పిచికారి చేయటంతో మొక్క పైనుంచి కింది భాగం వరకు పోషకాలు అందించవచ్చని అధికారులు తెలియజేస్తున్నారు. సుమారు పది కిలోమీటర్ల మేర వర్మీవాష్‌ను అధికారులు పూర్తి చేశారు. త్వరలో ఎన్- 9 రోడ్డుపై కూడా వర్మీవాష్ ప్రారంభిస్తామని చెపుతున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు


గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు

మంగళగిరిసిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని మంగళగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మంగళగిరి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో సీఐ జీ వీరాంజనేయులు గురువారం వివరాలను వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా, తాడేపల్లి పట్టణం మహానాడు 9వ రోడ్డులో వాటర్ ట్యాంకు సమీపంలో బండ్రెడ్డి నందు అనే వ్యక్తి వద్ద 1200 గ్రాముల గంజాయి ఉన్నట్టు గుర్తించామన్నారు. మధ్యవర్తుల సమక్షంలో గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ కే రవి కుమార్, హెడ్‌కానిస్టేబుల్ సందీప్, సిబ్బంది సుధీర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వధూవరులకు పెళ్లికానుక అందజేత


పెళ్లికానుక అందజేస్తున్న కొమ్మారెడ్డి కిరణ్

తాడేపల్లి (గుండిమెడ), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని గుండిమెడకు చెందిన ఎం శివకుమార్ - శిరీష దంపతులకు మంత్రి నారా లోకేశ్ పంపిన పెళ్లికానుకను గురువారం టీడీపీ తాడేపల్లి మండల మాజీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి కిరణ్ అందజేసి వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు చిగురు పాటి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి నామతోటి రాంబాబు, జెట్టి సుధాకర్, మొండ్రు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాపకశక్తి పెరుగుదలకు యోగా దోహదం


యోగా శిక్షణ శిబిరంలో చిన్నారులతో మెడికల్ ఆఫీసర్ అనూష

మంగళగిరి సిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరుగుదలకు యోగా దోహదం చేస్తుందని ఇందిరానగర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా చినకాకాని షైన్ ఆనంద శరణాలయంలో బాలబాలికలకు యోగా శిక్షణ తరగతులను గురువారం ఆమె ప్రారంభించారు. శ్రీరాధాకృష్ణ యోగా సేవాకేంద్రం ప్రధాన యోగాచార్యులు పడమట రాధాకృష్ణ యోగి గురూజీ చిన్నారులకు యోగా సాధనలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో శరణాలయం నిర్వహకురాలు సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

మంగళగిరి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు గురువారం ఘనంగా నిర్వహించాయి. మంగళగిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి షేక్ సలీమ్ ఆధ్వర్యంలో కేకు కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సలీమ్ మాట్లాడుతూ రాహుల్ నేటి యువతకు ఆదర్శమన్నారు. రాబోయే రోజుల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, అందుకోసం పార్టీ శ్రేణులు విస్తృతంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ కాంగ్రెస్ చేనేత విభాగం అధ్యక్షుడు రామనాథం పూర్ణచంద్రరావు, నేతలు రేమిణిశెట్టి హనుమంతరావు, షేక్ మున్నీ తదిరుతలు పాల్గొన్నారు.

కేఎల్‌యూ హాస్టల్ భవనాల మురుగునీరును అరికట్టాలి

● సీపీఎం కార్యదర్శి పల్లె కృష్ణ

తాడేపల్లి (గుండిమెడ), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని గుండిమెడ గ్రామ పరిధిలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ హాస్టల్ భవనాల నుంచి వస్తున్న మురుగునీరును అరికట్టాలని సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ గురువారం డిమాండ్ చేశారు. వందలాది మంది విద్యార్థులు నివాసం ఉంటున్న భవనాల్లో డ్రెయినేజి వ్యవస్థ సరిగ్గా నిర్మించుకోకపోవడంతో నిర్వాహకులు గ్రామాలకు రాకపోకలు సాగించే రహదారిపై బాహాటంగా మురుగునీరు వదలడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

బ్యాడ్మింటన్ కోర్టుల లీజుకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు (తూర్పు), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెనాలిలోని ఇండోర్ స్టేడియంలోని 4 బ్యాడ్మింటన్ కోర్టులు, టేబుల్ టెన్నిస్ హాల్ లీజుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల్గిన వారు తమ దరఖాస్తులతో పాటు, రూ.5వేల డీడీ తీసుకుని ఈ నెల 25వ తేదీలోపు బీఆర్ స్టేడియంలో అందజేయాలని తెలిపారు. ఇతర వివరాలకు 0863 2221951 అనే నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

శిథిలావస్థలో కల్వర్టులు

● పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



కుంచవరం, మున్నంగి కాల్వలపై పూర్తిగా దెబ్బతిన్న కల్వర్టులు



కొల్లిపర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): డెల్టా ప్రాంతంలో పంట కాల్వలపై ఏర్పాటుచేసిన కల్వర్టులు శిథిలావస్థకు చేరుకున్నాయి. కల్వర్టులకు ఏర్పాటుచేసిన సైడ్‌వాల్స్ లేకపోవడంతో పాటు ఇరు పక్కలా ఏర్పాటుచేసిన గోడలు నెర్రెలు ఇచ్చి పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఎప్పుడు కూలిపోతాయేమోనని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. వీటిపై ప్రయాణం చేయాలంటేనే వాహనదారులు భయపడుతున్నారు. కల్వర్టులు దెబ్బతిని 18 సంవత్సరాలు కావస్తున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారని గ్రామస్థులు వాపోతున్నారు. కొల్లిపర మండల పరిధిలో కుంచవరం, చివలూరు, మున్నంగి గ్రామాల పరిధిలో పంట కాల్వలపై ఏర్పాటు చేసిన కల్వర్టులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ కల్వర్టులకు ఏర్పాటుచేసిన గోడలు కుంగిపోవడంతో పాటు శ్లాబ్ అడుగుభాగాన చువ్వలు బయటపడ్డాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్థులు భయపడుతున్నారు. సైడ్‌వాల్స్ లేకపోవడంతో పశువులు తరచూ కల్వర్టుల మీద నుంచి జారి పడి గాయపడుతున్నాయి. అంతే కాకుండా రాత్రి సమయాల్లో వాహనదారులు కూడా ప్రమాదాలకు గురవుతున్నారు. కల్వర్టుల పరిస్థితి గురించి అనేక పర్యాయాలు ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు, ప్రజలకు ఎంతోగానో ఉపయోగపడే కల్వర్టుల నిర్మాణంపై నాయకులు, అధికారులు దృష్టిసారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



చివలూరు సమీపంలో కుంగిపోయిన కల్వర్టు



జ్ఞానదివ్యను అభినందిస్తున్న గ్రామస్థులు

పవర్ లిఫ్టింగ్‌లో సత్తాచాటిన జ్ఞానదివ్య

తెనాలి అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కఠెవరం గ్రామానికి చెందిన నాగం జ్ఞానదివ్య సత్తా చాటింది. పతకాలు సాధించిన క్రీడాకారిణిని గురువారం గ్రామానికి వచ్చిన ఆమెను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. గత నెల మేలో డెహ్రాడూన్‌లో జరిగిన పోటీల్లో బంగారు పతకంతో పాటు బెస్ట్ పవర్ లిఫ్టర్ అవార్డు సాధించింది. మహారాష్ట్రలో జరిగిన పోటీల్లో గోల్డ్ మెడల్, సాధించడంతో పాటు జాతీయ స్థాయి రికార్డు నెలకొల్పింది. తండ్రి నాగం వెంకటేశ్వరరావు, సర్పంచ్ బండికళ్ల ప్రసాద్, మొహిద్దీన్, కల్పన, రాంబాబు, నతీష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మా కాలనీలో జెండాచెట్టు వద్దు

● ఇన్‌చార్జి కమిషనర్‌కు నరేంద్రదేవ్ కాలనీ ప్రజల వినతి



ఇన్‌చార్జ్ కమిషనర్ లక్ష్మీపతిరావుకు వినతి పత్రం అందిస్తున్న నరేంద్రదేవ్ కాలనీ ప్రజలు

తెనాలి, మారీసుపేట,జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మా ప్రాంతంలో జెండా చెట్టు ఏర్పాటు వద్దంటూ నరేంద్రదేవ్ కాలనీ వాసులు కోరారు. గురువారం స్థానిక నందులపేట 4వ వార్డులోని నరేంద్రదేవ్ కాలనీ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నరేంద్రదేవ్ కాలనీ వాసులు పట్టణంలో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుర్రిపాలెం రోడ్డులో ఉన్న ముస్లింలు పవిత్రంగా పూజించే జెండాచెట్టును రోడ్డు విస్తరణలో భాగంగా అక్కడి నుంచి 4వ వార్డులోని నరేంద్రదేవ్ కాలనీకి మార్చేందుకు మున్సిపల్ అధికారులు పనులు చేపట్టారన్నారు. తమ ప్రాంతంలో హిందువులు ఎక్కువగా ఉన్నారని జెండాచెట్టును ఏర్పాటు చేయడంతో మతవిద్వేషాలు తలెత్తే ప్రమాదముందన్నారు. జెండా చెట్టును మరో ప్రాంతంలోకి తరలించితే మతసామరస్యాన్ని కాపాడిన వారవుతారని అన్నారు. అనంతరం మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ వి.మహాలక్ష్మీపతిరావుకు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు, ఏనిగేటి మునిమ్మ, రెడ్డి రమణమ్మ, చేవూరి శ్రీనివాసరావు, రమేష్, రామకృష్ణ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

22న ప్రతిభా పురస్కారాలు

తెనాలి అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 22న ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు ఈఎల్‌వీ అప్పారావు తెలిపారు. 20వ వార్షికోత్సవం సందర్భంగా ముత్తింశెట్టిపాలెంలోని కల్యాణ మండపంలో నిర్వహించే కార్యక్రమంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, దుస్తులు, ఉపకార వేతనాలు అందజేస్తామన్నారు. వివిధ రంగాల్లో పేరు గాంచిన వారిని సత్కరిస్తామని చెప్పారు.

వివాహం చేసుకుంటానని మోసం చేశాడంటూ ఫిర్యాదు

తెనాలి మారీసుపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి వివాహం చేసుకుందామని మాటఇచ్చి యువతిని మోసంచేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక నందుల పేటకు చెందిన యువతి తల్లిదండ్రులతో కలసి నివసిస్తోంది. అదేప్రాంతానికి చెందిన గుమ్మడి శ్రీనుబాబు ప్రేమిస్తున్నానంటూ నమ్మించటంతో వ్యాపారం చేసుకునేందుకు దఫాలవారీగా నగదును ఇచ్చింది. వివాహం చేసుకోమని కోరగా ఇంట్లోవారు ఒప్పుకోవడంలేదదనటంతో మోసపోయానని బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

30న ఇస్కాన్ రథయాత్ర

తెనాలి అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ తెనాలి ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర ఈ నెల 30న వినూత్న రీతిలో నిర్వహించనున్నట్లు మేనేజర్ సింహగౌరదాస్ తెలిపారు. నాజరుపేటలోని ఇస్కాన్ మందిరంలో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ, ఈ ఏడాది ఉత్సవాన్ని నాలుగు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. రథ్‌ఫెస్ట్ పేరుతో 28, 29 తేదీల్లో పిల్లలకు, యువకులకు సాంస్కృతిక పోటీలను వైకుంఠపురం ఆలయంలో నిర్వహిస్తామన్నారు. నృత్యం, సంగీతం, నటన, డిబేట్, చిత్రలేఖనం, క్రాఫ్ట్, ఫ్యాన్సీడ్రెస్, క్విజ్, భగవద్గీత పఠనం వంటి అంశాలలో 5 నుంచి 30 సంవత్సరాల వయసు వారికి 51 విభాగాల్లో పోటీలు జరుపుతామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 26లోగా 7013132678, 7013127878లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

అంజుమన్ కమిటీకి లక్ష రూపాయల విరాళం

పొన్నూరు టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణానికి చెందిన వ్యాపారవేత్త షేక్ గౌస్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు షేక్ నజీర్ గురువారం అంజుమన్ కమిటీకి లక్ష రూపాయలు విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మగ్బుల్ బేగ్, షేక్ బాబ్జీ, మహ్మద్ గౌస్, షేక్ మౌలాలీ, అబ్దుల్ మజీద్, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి: ఏవో

పొన్నూరు టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు రుణ అర్హత, గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్.వెంకటేశ్వరరావు తెలిపారు. నండూరు, పెదపాలెం, రైతు సేవా కేంద్రాలలో గురువారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కోసం రైతులు ఈకేవైసీ నమోదు చేసుకోవాలని సూచించారు. ఖరీఫ్ పంట కాలానికి రైతుసేవా కేంద్రాలలో బీపీటీ 5204, ఎంటీయూ 1224, రకం ధాన్యం విత్తనాలను కేజీకి రూ.5 రాయితీపై అందజేయడానికి సిద్ధం చేస్తున్నామన్నారు. వంద శాతం రాయితీపై జింకు సరఫరా చేయడానికి ప్రభుత్వం సాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి ఐ.శ్రీకాంత్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణ

తెనాలి అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆవిష్కరించారు. ప్రకాశం రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా జనాన్ని మోసం చేస్తుందన్నారు. రైతు భరోసా ఇవ్వలేకపోయారని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించలేదని, పట్టణాల్లో ఇంటి నిర్మాణానికి కఠిన నిబంధనలు విధించి కార్మిక లోకానికి పనిలేకుండా చేశారని విమర్శించారు. పార్టీ నాయకులు దేసు శ్రీనివాసరావు, చెన్నుబోయిన శ్రీనివాసరావు, వెంకటప్పరెడ్డి, సురేష్, బిదుర్గ, కౌన్సిలర్లు దుబాయ్‌బాబు, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ జన్మదినం

తెనాలి అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మారీసుపేట పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు కేక్ కట్‌చేసి పండ్లు పంపిణీ చేశారు. నాయకులు పొన్నూరు శశి, ద్వారకా శ్రీనివాస్, బుల్లియ్య, శివకుమార్, సత్యనారాయణ, వీరస్వామి, కార్తీక్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో సైకో కిల్లర్లు

● నెలన్నర క్రితం ఇదే తరహాలో మరో వృద్ధురాలి హత్య... దోపిడీ
● వెలుగు చూడని హత్యోదంతం ● కలకలం రేపుతున్న నేరాలు

గుంటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఒంటరి మహిళలే లక్ష్యంగా తెనాలిలో దోపిడీలు, హత్యలకు పాల్పడుతున్న సైకో కిల్లర్స్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. గురువారం తెనాలి 3టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పరిమిడొంకలో ఇద్దరు వృద్ధ మహిళలను దారుణంగా హత్యచేసి దోచుకున్న ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ హత్యలకు పాల్పడింది మారీస్‌పేట పరిధిలోని రవీంద్రనగర్ ప్రాంతానికి చెందిన వారిగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఇద్దరు యువకులు మరో మహిళ కలసి ఈ దారుణానికి పాల్పడినట్లు గుర్తించిన పోలీసులు ఇప్పటికే వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తాజాగా మరో హత్య ఉదంతం తెరపైకి వచ్చింది. ఇదే తరహాలో సుమారు నెలన్నర క్రితం అదే ప్రాంతంలో ఓ వృద్ధురాలిని హత్య చేసి బంగారు ఆభరణాలు దోచుకున్నట్లు తాజాగా వెలుగు చూసింది. అప్పట్లో ఓ వృద్ధురాలిని హత్యచేసి ఆమెపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకున్నారు. ఆ వృద్ధురాలికి ఇద్దరు కుమార్తెలు కాగా ఒంటిపై గాయాలు ఉండడం, బంగారం మాయం కావడంతో అప్పట్లో వారు అనుమానించినప్పటికీ పోలీసులకు ఫిర్యాదు చేసే ధైర్యం చేయలేకపోయారు. తాజాగా దాసరి రాజేశ్వరి, పేట అంజమ్మ అనే ఇరువురు ఒంటరి వృద్ధ మహిళలను కేవలం వారి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాల కోసమే హత్య చేసినట్లు గుర్తించడంతో పాటు పోలీసులు అనుమానిస్తున్న నిందితులు ఉన్న ప్రాంతానికి సమీపంలోనే నెలన్నర క్రితం తమ తల్లి మృతి చెందిన నేపథ్యంలో ఇదే తరహాలో హత్యకు గురైనట్లు ఆమె కుమార్తెలు అనుమానించారు. దీంతో గురువారం రాత్రి ఆ వృద్ధురాలి కుమార్తెలు తెనాలి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో పోలీసులు సైకో కిల్లర్స్ చేసిన నేరాలపై మరింత లోతుగా ఆరా తీస్తున్నట్లు తెలిసింది. గతంలో ఈ తరహాలో సైనైడ్ హత్యలకు పాల్పడిన మహిళ, అదేవిధంగా మహిళను ట్రాప్‌చేసి విషం కలిపి హత్య చేసి దోచుకున్న మరో మహిళా ముఠా ఉదంతాలు మరువక మునుపే ఈ సైకో కిల్లర్ల హత్యలు వెలుగులోకి రావడంతో తెనాలి ప్రాంతవాసులు ఉలిక్కిపడుతున్నారు. ఏ సమయంలో ఎటువంటి వార్త వినాల్సి వస్తుందోనని తెనాలి వాసులుభయాందోళన గురవుతున్నారు. తెనాలి ప్రాంతంలో గత కొద్ది సంవత్సరాలుగా ఇదే తరహా జరిగిన ఆయా దారుణ నేరాల్లో మహిళలే కీలకంగా హత్యలకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వ సహకారం



మత్స్య కేంద్రంలోని ల్యాబ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పొన్నూరు టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తోందని జిల్లా మత్స్యశాఖ అధికారి భూక్యా సైదా అన్నారు. నిడుబ్రోలు మత్స్యకేంద్రాన్ని గురువారం సైదా సందర్శించారు. కేంద్రంలోని ఆక్వా ల్యాబ్ చేపల తొట్టెలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 7 మండలాల్లో 77 హెక్టార్లలో చేపలు, రొయ్యలు సాగు జరుగుతోందన్నారు. ఆక్వా ల్యాబ్ ద్వారా నీటి నమూనాలను పరీక్షించి రైతులకు యాజమాన్య పద్ధతులు సూచిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నిడుబ్రోలు ఎఫ్‌టీవో జైనుల్లాఖాన్, ఎఫ్‌డీవో కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మెజిస్ట్రేట్ రుక్మిణి



సమావేశంలో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ రుక్మిణి

పొన్నూరు టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జూలై 5న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవా కేంద్రం ఛైర్మన్, మెజిస్ట్రేట్ జి.రుక్మిణి ఆదేశించారు. స్థానిక సివిల్ కోర్టులో గురువారం వివిధ బ్యాంక్‌ల అధికారులు, ప్రభుత్వం గుర్తింపు పొందిన ఫైనాన్స్ సంస్థలతో మెజిస్ట్రేట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా బ్యాంక్‌లు ఫైనాన్స్ సంస్థల పరిధిలో ఉన్న కేసుల వివరాల గురించి ఆరాతీసి జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కరించుకునేందుకు కృషిచేయాలని సూచించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజీసాహెబ్, న్యాయవాదులు మగ్బుల్‌బేగ్, జయరాజ్, ఆర్థిక సంస్థల అడ్వైజర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు దళారుల చేతుల్లో మోసపోవద్దు: ప్రొఫెసర్ జోసెఫ్

పొన్నూరు టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నికల్ కళాశాలలో ప్రవేశానికి విద్యార్థులు దళారుల చేతుల్లో మోసపోవద్దని ప్రొఫెసర్ జోసెఫ్ మోసగంటి గురువారం కోరారు. పాలిసెట్ అడ్మిషన్ కోసం ఈ నెల 20 నుంచి వెబ్ బేస్ కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. విద్యార్థుల ప్రవేశాల కోసం దళారులు రంగప్రవేశం చేసి విద్యార్థుల సర్టిఫికెట్‌లు తీసుకుని కమీషన్‌లు ఇచ్చే కళాశాలల్లో ప్రవేశాలు ఇప్పిస్తామని మోసం చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులు ఒరిజనల్ సర్టిఫికెట్‌లు ఎటువంటి పరిస్థితులలో దళారులకు ఇవ్వవద్దని సూచించారు. థర్డ్ గ్రేడ్ కళాశాలల్లో సీట్లు ఇప్పించి విద్యార్థులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులే స్వయంగా వెబ్ కౌన్సిల్‌లో నమోదు చేసుకోవాలని ప్రొఫెసర్ జోసెఫ్ సూచించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి: సీఐటీయూ కార్యదర్శి శివాజీ

పెదకాకాని, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ పెదకాకాని మండలం గురువారం ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో తక్కెళ్ళపాడు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డికి, ఉప్పలపాడు గ్రామ పంచాయతీ సర్పంచి శ్రీనివాసరావుకి సమ్మె నోటీసు ఇచ్చినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు రాజా రమేష్, ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ఉప్పలపాడు పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు గద్దె దేవసహాయం, పిల్లి దానియేలు, జి.బ్రహ్మం, సీహెచ్ సామ్రాజ్యం, తక్కెళ్ళపాడు పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు కే శేషగిరి, ఎస్కే సుభాష్‌చంద్రబోస్, ఆర్ బోడియ, ఎం.నాగేశ్వరావు, ఎస్.రాంబాబు, రంగా తదితరులు పాల్గొన్నారు.

అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే అడ్డుకోవాలి: శివసాంబిరెడ్డి

కొల్లిపర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గృహాలకు విద్యుత్ అధికారులు అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించటానికి వస్తే అడ్డుకోవాలని సీపీఎం తెనాలి కార్యదర్శి ములకా శివసాంబిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర గ్రామాల్లో అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపుపై సీపీఎం నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కోట చంద్రశేఖర్, సీఐటీయూ, సీపీఎం నాయకులు బత్తుల సుబ్బారావు, ఎం. రమేష్, ఎ. పూర్ణచంద్రరావు, పి. ఏసుపాదం, కె. పిచ్చయ్య, ఎం. మరియమ్మ, జి. దీనమ్మ, కె. సీతమ్మ, ఎస్. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగలకుదురులో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

తెనాలి అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం అంగలకుదురులో క్షయ వ్యాధిపై గురువారం ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. తెనాలి టీబీ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ, రెండు వారాల నుంచి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, కళ్లెలో రక్తపడటం వంటి లక్షణాలు ఉంటే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

డీలర్లు నిత్యావసరాలను సక్రమంగా పంపిణీ చేయాలి: తహసీల్దార్

కొల్లిపర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చౌకడిపో డీలర్లు నిత్యావసరాలను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన రేషన్ డీలర్లతో సమీక్ష నిర్వహించారు. నిత్యావసరాల పంపిణీపై డీలర్లకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, ఆర్ఐ వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు



వైద్య సేవలను పరిశీలిస్తున్న బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు శంకరరావు, రోటరీ క్లబ్ సభ్యుడు వెంకట పూర్ణచంద్, శ్రీనివాసరావు తదితరులు

తెనాలి, మారీసుపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సభ్యులు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గురువారం స్థానిక కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర పురపాలక బాలికోన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సభ్యులు మాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హస్పటల్స్ వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు కేసన శంకరావు పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 350మంది విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థులకు కంటి సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి డి.మురళీకృష్ణ, ఈదర వెంకటపూర్ణచంద్, గుత్తా వెంకటరత్నం, పావులూరి రాంబాబు, కన్నెగంటి మురళీకృష్ణ, కె.ఉపేంద్ర, ఆలపాటి కిరణ్, వెంపటి హరిప్రసాద్, మల్లాది అర్జున్, సుబ్బారావు, మాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హస్పటల్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

పొన్నూరు టౌన్, (చేబ్రోలు), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలులో వైన్‌షాపు యజమానిపై దాడిచేసిన సంఘటనపై చేబ్రోలు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎస్ఐ వెంకటకృష్ణ కథనం ప్రకారం అంగలకుదురు గ్రామానికి చెందిన యలమంచిలి జయంత్ చేబ్రోలు చెరువులోపాలెంలో వైన్‌షాపు నిర్వహిస్తున్నాడు. పులివర్తి చిన్నా, పులివర్తి కోటేశ్వరరావు, కొలకలూరి ఆనంద్ అనే ముగ్గురు ప్రతిరోజు మద్యం షాపుకు వచ్చి ఉచితంగా మద్యం ఇవ్వాలని లేదంటే గొడవ చేస్తామని ప్రతిరోజు వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ నెల 18న ఈ ముగ్గురితో పాటు మోపర్తి మురళి, శ్రీను, అనే ఇద్దరు వ్యక్తులతో పాటు ఐదుగురు వచ్చి మద్యం షాపు వద్ద గొడవకు దిగడమే కాకుండా షాపు యజమాని జయంత్‌ను బంధించి ఇనుపరాడ్డు, రాళ్లతో దాడిచేసి గాయపరిచారు. జయంత్ ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు.

నేడు రెవెన్యూ డే

పొన్నూరు టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ డే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జియావుల్‌హక్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ రికార్డులు ప్రదర్శించే స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రజల దరఖాస్తు చేసుకున్న ధృవీకరణ పత్రాలు ఈ కార్యక్రమంలో పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఉద్యోగులకు ప్రతిభ ఆధారంగా అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తహసీల్దార్ వివరించారు.

విద్యార్థిమిత్ర కిట్లను సక్రమంగా పంపిణీ చేయాలి

● సర్వశిక్ష అభియాన్ డైరెక్టర్ పార్వతి

కొల్లిపర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను పాఠశాలలకు సక్రమంగా పంపిణీ చేయాలని రాష్ట్రీయ మాధ్యమిక సర్వశిక్ష అభియాన్ డైరెక్టర్ పార్వతి అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర హైస్కూల్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర స్టాక్‌పాయింట్‌ను ఆమె తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. మండలంలోని పాఠశాలలకు విద్యార్థిమిత్ర కిట్లకు సంబంధించిన పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు, బూట్‌లు ఆయా ప్రధానోపాధ్యాయులకు అందచేసేరా లేదా అని విద్యాశాఖాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అందజేసిన విద్యార్థి మిత్ర కిట్స్‌ను ప్రధానోపాధ్యాయులు అలస్యం చేయకుండా విద్యార్థులకు వెంటనే అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు సాల్మన్‌రాజు, ఝాన్సీలత, ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఫిర్యాదుపై కేసు నమోదు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు పంచాయతీ మార్కెట్ ఆశీలు నగదు చెల్లించకుండా మోసంచేసిన సంఘటనపై చేబ్రోలు పోలీసులు కేసు నమోదుచేసి గురువారం దర్యాప్తు ప్రారంభించారు. 2024 సంవత్సరానికి సంబంధించి మార్కెట్ ఆశీలు వేలం వేపూరి బసవ పున్నయ్య అనే వ్యక్తి 9 లక్షలకు వేలం పాడి, పంచాయతీకి కేవలం రూ.2 లక్షలు మాత్రమే చెల్లించాడు. మిగిలిన 7లక్షలు పంచాయతీకి చెల్లించకుండా సొంత ప్రయోజనాలకే వాడుకున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.